
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 1-9-2023 15/-

## అవకాశవాదమే రాజకీయ మంత్రమా




విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు...
స్వయంగా విశ్రాంతి కోసం వెళ్ళిపోయారా!?




సఫర్ మాసం-అపశకున వాస్తవికత

# గీటురాయి వారపత్రిక

# GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in



సంపుటి 45 సంచిక: 35 హైదరాబాద్
శుక్రవారం 1 సెప్టెంబర్ 2023 రూ.15-00
15 సఫర్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

విశ్వాసి మరొక విశ్వాసికి దర్పణం లాంటివాడు. ఒక విశ్వాసి మరొక విశ్వాసికి సోదరునితో సమానం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| స్వేచ్ఛకు సంకెళ్ళు | ...... | 04 |
| అవకాశవాదమే రాజకీయ మంత్రమా | ...... | 05 |
| విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు... | ...... | 08 |
| జనాబ్ అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై.) కొన్ని జ్ఞాపకాలు | ...... | 11 |
| జాతిని కదిలించిన ఉద్యమ నినాదాలు | ...... | 12 |
| కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు-4 | ...... | 14 |
| ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్ | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఆత్మహత్య పరిష్కారం కాదు! | ..... | 20 |
| విద్వేష సేద్యం వినాశ ఫలం | ...... | 22 |
| చరితార్థులు-2 : అమానత్ అలీ | ...... | 23 |
| సఫర్ మాసం-అపశకున వాస్తవికత | ...... | 24 |
| అసూయ | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| ఈ ఏడాది ఏమన్నా మారిందా? | ...... | 34 |


**కామ్రేడ్లకు**
**కార్లో చోటు లేదు...**



ఎర్ర జెండ పార్టీలకు
షాకిచ్చిన కేసియారు
అవసరం లేదిప్పుడు
వదిలేసిండంట సారు!
ఖంగుతిన్న కామ్రేడ్లకు
కాంగీనే యిక అప్పను
ఇంకెందుకు ఆలస్యం
చెయ్యండిక యాక్షను!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# స్వేచ్ఛకు సంకెళ్ళు

విద్యాలయాల్లో, పరిశోధనాసంస్థల్లో స్వేచ్ఛా స్వతంత్రాలు ఎంతైనా అవసరం. కాని విశ్వవిద్యాలయాల స్వేచ్ఛలపై ఉక్కు పాదం మోపే పరిస్థితులు మన ముందుకు వస్తున్నాయి. "ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంలో పతనమవుతున్న ప్రజాస్వామిక విలువలు" అనే అంశంపై అశోక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఒకరు పరిశోధనా పత్రం రాశారు. దీనిపై ఆరా తీయడానికి విశ్వవిద్యాలయంలోకి ఇంటిలిజెన్స్ బ్యూరో అడుగుపెట్టిందనే వార్తలు వచ్చాయి. ఈ పరిశోధనా పత్రం రాసిన ప్రొఫెసర్‌ని, ఎకనమిక్స్ డిపార్టుమెంటులో ఫాకల్టీ సభ్యులను విచారించాలని ఇంటిలిజెన్స్ బ్యూరో వచ్చిందట.

అశోక విశ్వవిద్యాలయం ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం. పూనేలో ఉంటున్న సవ్యసాచి దాస్ ఈ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు. ఆయన రాసిన పరిశోధనా పత్రం గురించి పత్రికల్లో వచ్చిన వార్తలను పట్టుకుని ఇంటిలిజెన్స్ బ్యూరో యూనివర్శిటీ కాంపస్‌లోకి అడుగుపెట్టింది.

నిజానికి పోలీసు విభాగం మాదిరిగా లేదా మరో విచారణ సంస్థ మాదిరిగా ఎవరినైనా ప్రశ్నించే, విచారించే, అరెస్టు చేసే అధికారాలు ఐబికి లేవు. ఐబి పని అవసరమైన సమాచారాన్ని సేకరించడం. ఈ సమాచారం ఆధారంగా ఇతర విచారణ సంస్థలు చర్యలు తీసుకుంటాయి. సవ్యసాచి దాస్ రాసిన పరిశోధనా పత్రం ఆన్ లైన్ లో ముద్రించారు. ఈ పత్రంలో ముఖ్యమైన కీలకమైన అంశమేమిటంటే, 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ తక్కువ మార్జిన్‌తో గెలిచిన ఎన్ని స్థానాల్లో అవక తవకలకు అవకాశాలు ఏ మేరకు ఉన్నాయన్నది పరిశీలించడం. ఈ పరిశోధనా పత్రం రాజకీయ దుమారానికి కారణమైంది. బీజేపీ నేతలు దీనిపై మండిపడ్డారు. అశోక విశ్వవిద్యాలయంలో పెట్టుబడులు పెట్టిన వ్యాపారవేత్తలు, యూనివర్శిటీ బోర్డులో ఉన్నవారికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్లు కూడా వెళ్ళాయట. కేంద్ర విద్యామంత్రి నుంచి కూడా ఫోన్లు వెళ్ళాయట. పరిశోధనాపత్రం రాసిన ప్రొఫెసర్ ఉద్దేశ్యమేమిటంటూ మండిపడ్డారట.

అశోక విశ్వవిద్యాలయం విదేశీ విరాళాల లైసెన్సు సెప్టెంబరు 2023లో రిన్యూవల్ చేయించుకోవలసి ఉంది. ప్రభుత్వానికి, బీజేపీకి, బీజేపీ అనుబంధ సంస్థలకు ఇష్టం లేని పనులు చేస్తున్న సంస్థలను వేధించడానికి ఈ లైసన్సు ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. హెూం శాఖ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఈ సంస్థలపై పెత్తనం చెలాయిస్తుంది.

సవ్యసాచి దాస్ పరిశోధనా పత్రం తర్వాత అశోక విశ్వవిద్యాలయం ఈ పరిశోధనా పత్రంతో తమకు సంబంధం లేదని చేతులు దులుపుకుంది. ఆ తర్వాత దాస్ అక్కడి నుంచి రాజీనామా చేసేశారు. ఈ వివాదంలో విశ్వవిద్యాలయం వైఖరికి నిరసనగా మరో సీనియర్ ఎకనమిక్స్ ప్రొఫెసర్ పులపరే బాలకృష్ణన్ కూడా రాజీనామా చేశారు. దాస్‌కు మద్దతుగా ఎకనమిక్స్ డిపార్టుమెంటులో చాలా మంది ప్రకటనలు జారీ చేశారు.

ఇలాంటిదే మరో సంఘటన అన్ అకాడమీలో జరిగింది. ఇందులో న్యాయశాస్త్రం బోధించే కరణ్ సాంగ్వాన్ రాజకీయ ఉద్దేశ్యాలతో విద్యార్థులతో మాట్లాడారంటూ అన్ అకాడమీ ఆయన్ను తొలగించింది. ఆయన చెప్పిందేమిటంటే, విద్యార్థులతో మాట్లాడుతూ మీరు ఈ సారి ఓటు వేస్తున్నప్పుడు చదువుకున్న వారికి ఓటు వేయండి. లేకపోతే ఇలాంటి పరిస్థితులే వస్తాయి అన్నాడు. ఈ వీడియో వైరల్ అయ్యింది. ఆ వెంటనే అన్ అకాడమీ ఆయన్ను తొలగించింది. చదువుకున్నవారికి ఓటేయండి అని చెప్పడం నేరమెలా అయ్యింది? సాంగ్వాన్ ఎవరి పేరు తీసుకోలేదు, కాని చాలా మంది ఆయన బీజేపీని లక్ష్యంగా చేసుకుని ఈ వ్యాఖ్యలు చేశాడంటున్నారు. ఆయన్ను అన్ అకాడమీ తొలగించడాన్ని పలువురు విమర్శిస్తూ సాంగ్వాన్‌కు మద్దతుగా ముందుకు వచ్చారు. చదువుకున్న వారికి ఓటేయడమని చెబితే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం చల్లారకముందే ఇలాంటిదే మరో వీడియో ముందుకు వచ్చింది. భారత రాజకీయాల్లోకి చదువుకున్నవారు రావాలని ఆన్ లైన్ లో బోధించే బబితా మేడమ్ చెబుతున్న మాటల వీడియో అది. ఐసియస్ కోచింగ్ సెంటర్ పేరుతో నడిచే ఆన్ లైన్ ట్యూటోరియల్‌లో బోధిస్తున్న బబితా మేడమ్ కూడా ఇదే మాట చెప్పింది. మీరు ఓటు వేసినప్పుడు ఐదేళ్ళ కాలానికి మీ బాధ్యత వారికి అప్పగిస్తున్నారని తెలుసుకోండి. ఉద్యోగాలు, రిక్రూట్మెంట్, విద్యాసంస్థల ప్రమాణాలు అన్నింటి బాధ్యత వారిదే అవుతుంది. కాబట్టి చదువుకున్న వారికి ఓటేయండి అని చెప్పింది.

కాని ఈ మాటలు ప్రభుత్వంలో ఉన్నవారికి ఎందుకు కోపం కలిగించాయని ఇప్పుడు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ఇప్పుడు టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, పరిశోధకులు ఏది చెప్పాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించి మాట్లాడే పరిస్థితులు వచ్చాయన్నది స్పష్టంగా అర్థమవుతోంది. ✤

అబ్దుల్ వాహెద్







# అవకాశవాదమే రాజకీయ మంత్రమా

**కాంగ్రెస్** కర్నాటకలో ఘనవిజయం సాధించింది. దేశంలోని లౌకికవాద శక్తులు సంతోషించాయి. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా కర్నాటక ప్రజలు గొప్ప తీర్పు చెప్పారని చాలా మంది భావించారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ దేశంలో ప్రేమాభిమానాల దుకాణాలు తెరుస్తానని అన్నారు. జనం సంతోషించారు. విద్వేష వాతావరణం ఇక సమసిపోతుందనుకున్నారు. నిజంగా ఇదంతా జరుగుతుందా?

ఇటీవల కాంగ్రెసు నాయకుడు అజీజ్ ఖురైషీ కాంగ్రెసుపై చేసిన వ్యాఖ్యలు గమనించదగినవి. విదిశాలో కాంగ్రెసు ముస్లిం నేతలతో మాట్లాడుతూ కాంగ్రెసు సీనియర్ నాయకుడు అజీజ్ ఖురైషీ చేసిన వ్యాఖ్యలు మధ్యప్రదేశ్‌లో బీజేపీకి కాంగ్రెసుపై దాడి చేసే అవకాశాలిచ్చాయన్నది నిజమే. కాని అజీజ్ ఖురైషీ వ్యాఖ్యల్లో నిజం లేదా? 82 సంవత్సరాల అజీజ్ ఖురైషీ ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మంత్రిగా సేవలందించారు. లోక్‌సభలో సీనియర్ సభ్యుడు. ఆయన చేసిన వ్యాఖ్యలు కొట్టిపారేయదగినవి కావు. కాంగ్రెసు వైఖరిని నిరసిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెసు సాఫ్ట్ హిందుత్వ కార్డు ఉపయోగిస్తుందని విమర్శించారు. ముస్లిములు మీకు బానిసలు కాదంటూ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెసుతో సహా అన్ని పార్టీలు ఈ విషయం అర్థం చేసుకోవాలని, ముస్లిములు ఎవరికీ బానిసలు కాదని, అసలు ముస్లిములు మీకెందుకు ఓటేయాలని అడిగాడాయన. పోలీసు, డిఫెన్సు, బ్యాంకు మొదలైన చోట్ల ముస్లిములకు ఉద్యోగాలు దొరకడం లేదని, బ్యాంకు రుణాలు వారికి దొరకవని, అలాంటప్పుడు ఎందుకు ఓటేయాలంటూ ఆయన మండిపడ్డారు. ముస్లిముల దుకాణాలు, వారి ఇండ్లు, ఆరాధనాలయాలు దాడులకు గురవుతున్నాయి, దహనమవుతున్నాయి, పిల్లలు అనాధలవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెసులోను కొందరు నేతలు మతపరమైన రాజకీయాలు నడుపుతున్నారని, గుళ్ళు గోపురాలు తిరుగుతున్నారని చెప్పారు. జై గంగామాతాకి, జై నర్మదా మాతాకి నినాదాలిచ్చుకుంటూ తిరగడం ద్వారా ఓట్లవాన కురుస్తుందని ఆశిస్తున్నారని చెప్పారు. కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు చేసిన అజీజ్ ఖురైషీ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ప్రకటించారు. కావాలంటే తనను కాంగ్రెసు పార్టీనుంచి బహిష్కరించవచ్చని సవాలు విసిరాడు. ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలు, విలువలను కాంగ్రెసు పార్టీ ఇప్పుడు తుంగల్లో తొక్కిందని అన్నారు.

ఈ వ్యాఖ్యల వీడియోను ఇప్పుడు బీజేపీ వాడుకుంటోంది. కాంగ్రెసు నేతలు ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారో చూడండంటూ మధ్యప్రదేశ్‌లో రాజకీయ ప్రయోజనాలు పొందడానికి ప్రయత్ని

స్తోంది. దీనివల్ల కాంగ్రెసుకు నష్టం కలుగుతుందా? లేదా?? అన్నది తర్వాతి ప్రశ్న. అజీజ్ ఖురైషీ లేవనెత్తిన ప్రశ్నల్లో వాస్తవం ఉందా లేదా అన్నది అసలు ప్రశ్న.

మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెసు నాయకుడు కమల్ నాథ్ ఇప్పుడు హిందూత్వ రాజకీయాలు కొద్దిగా నడిపితేనే విజయం లభిస్తుందనుకుంటున్నాడు. మధ్యప్రదేశ్ లోని మరో ముఖ్యమైన నాయకుడు, సెక్యులర్‌వాదిగా పేరుపడిన దిగ్విజయసింగ్ హిందూత్వ సంస్థ భజరంగ్‌దళ్ గురించి మాట్లాడుతూ అందులో కూడా కొందరు మంచివాళ్ళు ఉండవచ్చు కాబట్టి తాము అధికారంలోకి వస్తే నిషేధించడం జరగదని అన్నారు. కాని భజరంగ్‌దళ్‌లో అల్లర్లకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

మధ్యప్రదేశ్ కాంగ్రెసు పార్టీ ఇప్పుడు లౌకికవాదానికి కట్టుబడి ఉందా? లేక సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలు నడుపుతుందా? కమల్ నాథ్ సాఫ్ట్ హిందూత్వకు జై కొడుతున్నాడు. దిగ్విజయ సింగ్ కొంతలో కొంత మెరుగు. లౌకికవాదానికి కట్టుబడి ఉండాలంటున్నాడు. కర్నాటకలో పత్రికలతో మాట్లాడుతూ దిగ్విజయ సింగ్ స్పష్టంగా లౌకికవాదానికి కట్టుబడి ఉన్నానని ప్రకటించాడు. హిందూరాష్ట్ర గురించి ఎవరైనా మాట్లాడుతుంటే అలాంటి వాళ్ళు రాజ్యాంగ పదవుల నుంచి తప్పుకోవాలని చెప్పాడు. హిందూరాష్ట్ర గురించి కమల్ నాథ్ ఆలోచనలు వేరుగా ఉన్నాయి. దేశంలో 82 శాతం జనాభా హిందువులే కాబట్టి దేశం హిందూరాష్ట్ర అని ఆయన అన్నాడు. కాంగ్రెసు పార్టీలోని వైరుధ్యాలు మధ్యప్రదేశ్ నేతలను గమనిస్తే స్పష్టంగా తెలుస్తున్నాయి.

భాగేశ్వర్ బాబా గురించి చాలా మంది చదివే ఉంటారు. భాగేశ్వర్ బాబా భారతదేశం హిందూరాష్ట్ర కావాలని బాహాటంగా ప్రకటించాడు. ముస్లిములకు వ్యతిరేకంగా బాబా భాగేశ్వర్ వ్యాఖ్యలు అందరికీ తెలిసినవే. గతంలో అంటరానితనం పాటిస్తున్న ఆరోపణలు ఆయనపై వచ్చాయి. మరో సందర్భంలో బుల్డోజర్ బాబాగా పేరు పొందాడు. హిందువులంతా ఒక్కటై తమపై రాళ్ళు విసురుతున్న వారి ఇండ్లపై బుల్డోజర్లు నడపాలని అన్నాడు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం బుల్డోజర్ రాజకీయాలు ఎప్పటి నుంచో నడుపుతూనే ఉంది. బాబా భాగేశ్వర్ వ్యాఖ్య నిజానికి ముస్లిములకు విరుద్ధంగా చేసిన వ్యాఖ్య అన్నది చాలా మంది స్పష్టంగా వివరించారు. బాబా భాగేశ్వర్ కు కాంగ్రెసు నాయకుడు కమల్ నాథ్ ఇప్పుడు ముఖ్య భక్తుడైపోయాడు. బాబా భాగేశ్వర్‌కు మధ్యప్రదేశ్‌లో భక్తులు కూడా చాలా మంది ఉన్నారు, కాబట్టి రాజకీయంగా ఆయనతో సాన్నిహిత్యం వల్ల ప్రయోజనాలున్నా

## నమ్మినా నమ్మకపోయినా ? 4

# పక్షపాతం

100 మీటర్ల పరుగుపందెంలో ప్రతి ఒక్కరూ నిర్దేశిత నియమాలకు లోబడి పరుగుతీస్తారు. తన ప్రయత్నం, ప్రతిభల ప్రకారంగానే వారికి బహుమతి ప్రదానం చేయబడుతుంది. వారు తమ లక్ష్యానికి ముందు లేక వెనుక చేరుకుంటారు. అంగవైకల్యం కలిగిన వ్యక్తి నిర్దేశిత లక్ష్యాన్ని తాబేలు వేగంతో చేరుకున్నా సరే అతను కూడా బహుమతి పొందగలడు. ఎవరి పట్లనూ ఎలాంటి పక్షపాతం చూపబడదు.

అందుచేత నిర్దేశిత నియమాలను దృష్టిలో వుంచుకొని ప్రతివాడూ తన లక్ష్యాన్ని చేరుకోవాలనే కోరుకుంటాడు. తమ సర్వశక్తులు ఒడ్డి లక్ష్యాన్ని చేరుకోవటంపైనే ప్రతి ఒక్కరూ తమ దృష్టిని కేంద్రీకరిస్తారు.

అదేవిధంగా మాతృగర్భం నుండి పుట్టినప్పటి నుండి ప్రతివాడూ ఈ ప్రపంచ జీవితంలో తన జీవితాన్ని ముగించుకొని దైవప్రీతిని పొందే ప్రయత్నంలో పరుగులు తీస్తూనే వున్నాడు.

దైవాదేశాల ప్రకారం ఈ లోకంలో నడుచుకున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా మరణానంతరం మరో ప్రపంచంలో సత్కరించబడతారు– వారు ధనికులైనా పేదలైనా, నల్లవారైనా తెల్లవారైనా, ఏ దేశానికి చెందినవారైనా, ఏ యుగంలో జన్మించినా చివరికి వారు అంగవైకల్యం కలవారైనా సరే. స్త్రీ పురుషుడు ఎవరైనా దేవుని నిర్దేశిత ఆజ్ఞలకు లోబడి ఆయన చూపిన మార్గానుసరణలో నడుచుకుంటే అలాంటి వారికి దేవునివద్ద ఎన్నో వరాలున్నాయి. ఎవరి పట్ల కూడా పక్షపాతం చూపబడదు. నమ్మినా, నమ్మకపోయినా దైవాభీష్టాన్ని పొందే ప్రయత్నంలో నడుచుకున్న ప్రతి ఒక్కరికీ ఈ ప్రపంచ జీవితంలో శాంతి లభిస్తుంది.

దైవప్రీతిని బడయటానికి కృషిచేసే ప్రతి కుటుంబానికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఎలాంటి పక్షపాతం లేదు – దాని పరిపూర్తికి ప్రతివారూ ఒకరికి మరొకరు చేదోడుగా నిలిస్తే నమ్మినా, నమ్మకపోయినా అలాంటి వారి కుటుంబాల్లో శాంతి నెలకొంటుంది.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

యని కమల్ నాథ్ వంటి కాంగ్రెసు నేతలు భావిస్తున్నారు.

ఇదే పరిస్థితి మనకు రాజస్థాన్‌లో కూడా కనిపిస్తోంది. అక్కడ కాంగ్రెసు ముఖ్యమంత్రి గెహ్లాట్ గుళ్ళు గోపురాలు తిరగడంలో బిజిగా గడుపుతున్నారు. మధ్యప్రదేశ్ లో ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నర్మదా పూజ హారతులతో ప్రారంభించారు. రాజస్థాన్‌లో మూకదాడుల నేరానికి పాల్పడిన హంతకుడు మోను మానేసర్ వీడియో ప్రసంగాలు జారీ చేస్తున్నాడు, కాని రాజస్థాన్ పోలీసులకు అతను దొరకడం లేదట. సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలు ఉత్తరాదిన నడపడం చాలా అవసరమని కాంగ్రెసు భావిస్తుందా?

మణిపూర్ హింసాకాండపై కాంగ్రెసుపార్టీ తీవ్రమైన స్వరంతో ప్రభుత్వాన్ని నిలదీసింది. కాని ఢిల్లీ అల్లర్లు ఇంతకు ముందు జరిగినప్పుడు కాంగ్రెసు ఇలాగే ప్రతిస్పందించిందా? నూహ్, గుర్‌గావ్‌లు ఇప్పుడు హింసాకాండతో అట్టుడికినప్పుడు కాంగ్రెసు ఏం చేసింది? నూహ్, గుర్‌గావ్‌లలో హింసాకాండ తర్వాత ప్రభుత్వం అక్కడ ముస్లిముల ఇండ్లు, దుకాణాలను బుల్డోజర్లతో కూల్చడం ప్రారంభించింది. పంజాబ్ హర్యానా హైకోర్టు దీనిపై తీవ్రంగా వ్యాఖ్యానించింది. కోర్టు ethnic cleansing వంటి తీవ్రమైన పదాన్ని ప్రయోగించింది. ప్రభుత్వం జాతి హననానికి పాల్పడుతుందా అని ప్రశ్నించింది. ఇవి చాలా తీవ్రమైన వ్యాఖ్యలు. హర్యానాలో ప్రభుత్వం ముస్లిములను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలకు పాల్పడుతుందన్నది స్పష్టంగా కనబడుతున్నప్పటికీ హర్యానా కాంగ్రెసు ఈ విషయమై నోరు విప్పిందా? మణిపూర్ గురించి ప్రధాని నోరు విప్పడంలేదని హంగామా చేసిన కాంగ్రెసు, నూహ్, గురుగ్రామ్ లలో జరుగుతున్న దౌర్జన్యాలపై ఎందుకు మాట్లాడడం లేదు. సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలు కాదా?


మధ్యప్రదేశ్‌లో 2003 తర్వాతి నుంచి బీజేపీ అధికారంలో ఉంది. మధ్యలో కొన్ని నెలలు కాంగ్రెసు ప్రభుత్వం వచ్చినా బీజేపీ ఆ ప్రభుత్వాన్ని పడగొట్టింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నుంచి అధికారాన్ని లాక్కుంటే దేశంలోని వివిధ ప్రాంతాల్లో కూడా విజయాలు సాధ్యమవుతాయన్నది కాంగ్రెసు ఆలోచన. గతంలోను మధ్యప్రదేశ్‌లో గెలిచింది. కాని కాంగ్రెసు నేతలు గోడ దూకి బీజేపీ ప్రలోభాలకు లొంగిపోయారు. కాంగ్రెసు ప్రభుత్వం కూలిపోయింది. కాంగ్రెసులో సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలను ఇష్టపడే నేతలున్నంత కాలం కాంగ్రెసుకు ఈ పరిస్థితి తప్పదు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ విజయానికి కారణం వెనుకబడిన వర్గాలను ఆకట్టుకోవడం. ఉమాభారతి, బాబూలాల్ గౌర్, శివరాజ్ చౌహాన్ వంటి నేతలు వెనుకబడిన వర్గాల వారే. వెనుకబడిన వర్గాలను హిందూత్వ రాజకీయాల వైపు నడపడం బీజేపీ అక్కడ సాధించిన విజయం. ఇదే ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లోను నడుస్తోంది.

వెనుకబడిన వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నాలు తనతరపున కాంగ్రెసు కూడా చేస్తోంది. కులజనగణన కోసం గొంతు విప్పింది. 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగించాలని డిమాండ్ చేస్తోంది. వీటన్నింటితో పాటు సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో 2024లో అధికారం కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. కాని ఆలోచించవలసిన ప్రశ్నలు ఏమిటంటే, ఇంతకు ముందు అజీజ్ ఖురైషీ అడిగిన ప్రశ్నలు.

ముస్లిం విద్వేషమే రాజకీయాల్లో ప్రధానంగా కనిపిస్తున్న ప్రస్తుత కాలంలో కాంగ్రెసు వివిధ అంశాలపై తన విధానాలను స్పష్టంగా ప్రకటించవలసిన అవసరం ఉంది. ప్రేమాభిమానాల దుకాణాలను తెరుస్తామంటున్న రాహుల్ గాంధీ ఆ దుకాణాల్లో ముస్లిములకు ప్రవేశం ఉందో లేదో చెప్పాలి. హర్యానాలో వరుసగా అనేక ర్యాలీలు జరుగుతున్నాయి. ముస్లిం విద్వేష ప్రసంగాలు జరుగుతున్నాయి. బాహాటంగా ధర్మసంసద్లలో ముస్లిములపై హింసాకాండకు పిలుపులు వినిపిస్తున్నాయి. వీటన్నింటిపై కాంగ్రెసు తన వైఖరి ఏమిటో ప్రకటించాలి. కొన్ని పంచాయతులు ముస్లిములపై నిషేధాజ్ఞల లేఖలు జారీ చేసిన వార్తలు వచ్చాయి. వాటిపై కాంగ్రెసు తన విధానాన్ని ప్రకటించాలి. ముస్లిం విద్వేష వ్యాఖ్యలు, ప్రసంగాలు చేసి దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలి. లౌకికవిలువలను కాపాడ్డానికి చేసే ప్రయత్నాలేమిటో చెప్పాలి. మూకహత్యలు, మూకదాడుల విషయంలో ఎలాంటి వైఖరి అవలంబిస్తారో, గోరక్షక దళాల దాడుల నుంచి పశువులను చట్టబద్దంగా రవాణా చేస్తున్న ముస్లిములను గోరక్షకుల పేరుతో దాడులు చేస్తున్న గుండాల నుంచి కాపాడ్డానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలి. పౌరసత్వ సవరణ చట్టంపై కాంగ్రెసు వైఖరి ఏమిటో చెప్పాలి. అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని ఏం చేస్తారో చెప్పాలి. ఎన్నార్సీ విషయంలో కాంగ్రెసు తన వైఖరి స్పష్టంగా ప్రకటించాలి.

సాఫ్ట్ సెక్యులరిజం ప్లస్ సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో గోడ మీది పిల్లివాటం రాజకీయాలు కాంగ్రెసు నడిపినంత కాలం కాంగ్రెసుకు నిజమైన గుర్తింపు ఏదీ దొరకదు. లౌకికవాదం కోసం బలంగా నిలబడే పార్టీగా అవసరమైతే ఎన్నికల ప్రయోజనాలను కూడా త్యాగం చేసే పార్టీగా కాంగ్రెసు ముందుకు వస్తుందా?

✤




# విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు... స్వయంగా విశ్రాంతి కోసం వెళ్ళిపోయారా!?

**- మలిక్**

**ఆదివారం, ఆగష్టు 13న** ఆయన రాసిన ఒక లేఖ చదివాను. ప్రస్తుత పరిస్థితులు తనకు నిద్రలేకుండా చేస్తున్నాయని రాశారు. నేను దానిపై నా ప్రతిస్పందన కూడా చెప్పాను. ఆ తర్వాత ఆయన నాతో... మలిక్ భాయి... ఎలా ఉన్నారు? ... కాస్త విశ్రాంతి తీసుకోండి... అల్లాహ్‌ను ప్రార్థించండి... ఇన్షాఅల్లాహ్ అంతా సర్దుకుంటుంది అన్నారు. ఆ తర్వాత మా అబ్బాయి సల్మాన్‌తో మాట్లాడుతూ, "నేను రాసిన మాటలు మలిక్ భాయి వరకు ఎలా వెళ్ళాయో, ఆయన ఎమోషనల్ అయిపోయారు.. కాస్త ఆయన్ను శ్రద్ధగా చూసుకోండి" అని చెప్పారు.

ఆయన చెప్పిన ఈ మాటలే నాతో ఆయన చివరి మాటలని నాకు తెలియదు. ఈ మూడు రోజుల్లో ఏమయ్యిందో తెలియదు. మనందరినీ దుఃఖ సముద్రంలో ముంచుతూ ఆయన స్వయంగా విశ్రాంతి తీసుకోడానికి వెళ్ళిపోయారు. మనం ఏం చేయగలం? అల్లాహ్ ప్రసన్నతను పొందడమే జీవితంగా బతుకుతున్నవాళ్ళం, మన గుండెల్లో మంటలను భరిస్తూ అల్లాహ్‌ను వేడుకోవడం తప్ప ఏం చేయగలం? దుఃఖంతో మిత్రులందరు చేస్తున్న ప్రార్థనలు ఆ అల్లాహ్ వాలాతో పాటున్నాయి.

అల్లాహ్ వాలే అందరూ ఒక్కొక్కరుగా అల్లాహ్ వైపునకు మరలిపోతున్నారు. భూమిపై ఉన్న మనలాంటి వారి వంతు ఎప్పుడు వస్తుందో తెలియదు.

### ఆయన సేవలు అనితరసాధ్యమైనవి

విద్యార్థిసంఘం సెక్రటరీగా, యస్.ఐ.యు అధ్యక్షునిగా, తర్వాత యస్.ఐ.ఓ. అధ్యక్షునిగా మూడు సంస్థలతోను ఆయనకు పటిష్ఠ

మైన సంబంధాలున్నాయి. బాసిత్ భాయి ఒక గొప్ప కథకుడు. సాహిత్యంలో మంచి ప్రవేశం ఉన్నవారు. కవిత్వంపై అధికార మున్నవారు. విద్యార్థి కాలం నుంచి సాహిత్యం పట్ల, విద్యాపర మైన పనుల పట్ల ఆసక్తి కలిగి ఉండేవారు. ఆయన అరబీ భాషలో ఎం.ఏ చేశారు. ఇస్లామీయ ఉద్యమాలపై ఆయన పరిశోధనాపత్రం పిహెచ్డీ కోసం సిద్ధమయ్యింది కూడా. కాని ఏమయ్యిందో తెలియదు, ఆయన పిహెచ్డీ పూర్తి చేయాలను కున్నారు, కాని బహుశా ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలు ఆయనకు అంత తీరిక లభించకుండా చేశాయేమో.

యస్.ఐ.ఓ ఏర్పడిన తర్వాత అఖిల భారత స్థాయిలో ఆర్థిక కార్యదర్శిగా ఆయన నియుక్తులయ్యారు. ఈ హెూదాలో ఆయన పూర్తి దేశంలో పర్యటనలు చేశారు. ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. పరిస్థితులను కళ్ళారా చూసి తెలుసుకున్నారు. ఇస్లామీయ ఉద్యమ అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చి వ్యక్తిగత ఆకాంక్షలను, అవసరాలను, ఆసక్తు లను పక్కన పెట్టిన అతి కొద్ది మంది ఉద్యమ త్యాగశీలుల జాబితాలో ఆయన ఒకరు. ఆయన కుటుంబసభ్యులు కూడా ఆయనకు పూర్తి మద్దతిచ్చారు. ఇలా జరగడం చాలా అరుదు.

జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా విభాగం అధ్యక్షునిగా ఆయన ఎన్నికైనప్పుడు, ఆయనకు ఆ వార్త తెలియ జేసే సౌభాగ్యం నాకు లభించింది. అప్పుడు ఎక్కడో పర్యటనలో ఉన్న బాసిత్ భాయి రెండవ రోజున లేదా మూడవ రోజున వాపసు వచ్చారు.

## దావత్ విభాగంలో సేవలు

జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా విభాగంలో బాసిత్ భాయి అమీరె హల్కాగా రాక ముందు దావత్ విభాగం ఉండేదో లేదో నాకు గుర్తు లేదు. నన్ను దావత్ విభాగం కార్యదర్శిగా ఆయన నియమించారు. నాకు బాగా గుర్తుంది, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో నేను, నా తోటివారు కలిసి పర్యటించాము. నేడు ఆంధ్రప్రదేశ్ అమీరె హల్కాగా ఉన్న ముహమ్మద్ రఫీక్ కూడా బహుశా ఆ పర్యటనల్లో ఒకటి రెండు సార్లు నాతో ఉన్నారు.

నేను దావత్ విభాగం కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో అసంఖ్యాక పర్యటనలు బాసిత్ భాయితో చేశాను. ఈ సందర్భంగా బాసిత్ భాయి పనితీరును ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది. ఆయన జమాఅత్ పనులను గురించి వివరణలు తీసుకుంటున్నప్పుడు చాలా మృదువుగా మాట్లాడే వారు. ఒకవేళ కాస్త కఠినంగా మాట్లాడవలసి వస్తే, మందలించ వలసి వస్తే, "ఇది నా పని కాదు, మీ పని కాదు, విశ్వప్రభువుకు సంబంధించిన పని. ఈ పనికి నా ముందు జవాబు చెప్పుకోవడం కాదు, రేపు విశ్వప్రభువు ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది" అనేవారు. ఈ మాటలు చాలు కార్యకర్తలు, సభ్యులు తలదించుకుని వినేవారు. తమ బలహీనతలపై కన్నీళ్ళ పర్యంతమయ్యేవారు.

బాసిత్ భాయి కేంద్రంలో కూడా కార్యదర్శి హెూదాలో పనిచేశారు. శిక్షణా విభాగం కార్యదర్శిగా ఉండేవారు. అప్పట్లో శిక్షణకు సంబంధించి ఒక కార్యాచరణ పత్రం, ప్రణాళిక తయారు చేయడం జరిగింది. అప్పటి చాలా విషయాలు ఇప్పుడు నాకు గుర్తుకు రావడం లేదు.

ఆంధ్రప్రదేశ్, ఒడిశా విభాగానికి అమీరె హల్కాగా ఖాజా ఆరిఫుద్దీన్ గారు నియమించబడినప్పుడు ఆయన యస్.ఐ.ఓ.లో తనతో పాటు పని చేసిన బాసిత్ భాయి ప్రతిభా నైపుణ్యాలను ఉపయోగించుకోవాలనుకున్నారు. అందువల్ల ఆయన్ను తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ డైరెక్టర్‌గా నియమించారు.

## అనుపమ మాసపత్రిక

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ డైరెక్టరుగా బాసిత్ భాయి అందించిన సేవల్లో అనుపమ మహిళా మాసపత్రిక ఏర్పాటు గురించి ప్రత్యే కంగా చెప్పుకోవాలి. ఈ పత్రిక కోసం రచయిత్రుల శిక్షణకు ఆయన తీసుకున్న శ్రద్ధ ప్రస్తుతించదగినది. ఈ పని కోసం ఆయన మహిళల ఒక బృందాన్ని పొరుగురాష్ట్రం కర్నాటక పంపించారు. కర్నాటకలో నడుస్తున్న మహిళా మాసపత్రికను ఎలా నడుపు తున్నారో అధ్యయనం చేయడానికి పంపించారు. నా రెండవ అబ్బాయి గుఫ్రాన్ మాస్ కమ్యునికేషన్స్‌లో ఎం.ఏ. చేశాడు. గుఫ్రాన్‌తో ఈ మహిళా మాసపత్రికకు సంబంధించి ఒక ప్రాజెక్టు రిపోర్టు, ప్రపోజల్ తయారు చేయించారు. మహిళాబృందం రిపోర్టును కూడా ఆయన పరిశీలించారు. వీటన్నింటి తర్వాత మహిళా మాసపత్రిక అనుపమ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. నేడు ఈ పత్రిక అల్ హందులిల్లాహ్ రెగ్యులర్‌గా నడుస్తోంది.



## అనారోగ్యం

ఆయనకు హఠాత్తుగా డయాబెటిస్ వ్యాధి దాపురించింది. డయాబెటిస్ చికిత్సకు ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. డాక్టర్ల సలహాతో నేచర్ క్యూర్ పద్ధతి చికిత్స కోసం, నగరానికి దూరంగా గండిపేటలోని నేచర్ క్యూర్ కేంద్రంలో చేరి చికిత్స పొందారు. ఎప్పుడైనా ఎక్కడైనా విందు భోజనాలకు హాజరయినప్పుడు, అక్కడ మిఠాయి ఉంటే అది చూస్తూ నాతో చిరునవ్వుతో 'మలిక్ భాయి! ఒక్క చెంచా...' అనేవారు... నేను కూడా నవ్వుతూ చూసేవాడిని...

అల్లాహ్ అయనకు ఎంతో గొప్ప గొప్ప ఆహార పదార్థాలు తినిపించుగాక! ఆయన్ను తలచుకోవడం తప్ప ఏం చేయగలను? మనిషి ఎంత నిస్సహాయుడు?

షుగర్ వ్యాధి వల్ల ఆయన కాలి బొటనవేలులో కొంత భాగం తీసేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఆయన స్థిరచిత్తానికి మారుపేరుగా పనిచేశారు. తన ఉద్యమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించారు. ఆయనకు గుండెనొప్పికి వైద్యం జరిగింది. ఆపరేషను చేయించుకున్నారు. ఈ ఆరోగ్యసమస్యలు ఉన్నప్పటికీ ఆయన తన బాధ్యతల విషయంలో ఎన్నడూ వెనుకంజ వేయలేదు.

బాసిత్ భాయి తమ్ముడు అబూ యూసుఫ్. వారు ఒక కుటీర పరిశ్రమ నడిపేవారు. ఈ పరిశ్రమ వ్యవహారాలన్నీ తమ్ముడు యూసుఫ్ చూసేవారు. అన్నయ్య బాసిత్ భాయి ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలకు తన జీవితం అంకితం చేశారు. ఈ సోదరుల మధ్య ప్రేమాభిమానాలు ఆదర్శనీయమైనవి. బాసిత్ భాయిని పిల్లలు ఒత్తిడి చేసి విశ్రాంతి తీసుకోవాలని అమెరికా పిలిపించారు. అమెరికాలో ఆయన కుమార్తె ఉన్నారు. అప్పుడు కూడా ఆయనతో అనేకసార్లు మాట్లాడాను. ఆయన అక్కడి నుంచి వచ్చిన తర్వాత నా అనారోగ్యం వల్ల ఆయన్ను కలవడానికి నేను వెళ్ళలేకపోయాను. మీరెందుకు వస్తారు, నేనే వీలు చూసుకుని కలవడానికి వస్తానని ఆయన చాలా సార్లు చెప్పారు. కాని ఆయన ఆరోగ్యం కూడా అందుకు సహకరించలేదు. నాకు కూడా వెళ్ళి కలిసే అవకాశం దొరకలేదు. కేవలం ఫోనుపై మాత్రమే మాట్లాడుకోవడం జరిగేది. చివరకు అగష్టు 13వ తేదీన ఆయన రాసిన లేఖ చూశాను. నేను దానికి ప్రతిస్పందన రాశాను. ఆయన నా ఆరోగ్యం గురించి మా అబ్బాయికి (దుబాయ్‌కి) ఫోను చేసి కనుక్కున్నారు.

పరీక్షలు, సమస్యలు, కష్టాలు, ఫిర్యాదులకు దూరంగా ఆయన వెళ్ళిపోయారు. నిజాయితీ, సేవాతత్పరతల జీవితం గడిపినందుకు ప్రతిఫలం పొందడానికి ప్రయాణమయ్యారు. విశ్వప్రభువు ప్రసన్నత, కారుణ్యాల నీడలో చోటు సంపాదించుకోడానికి, తన నిజప్రభువును కలుసుకోడానికి వెళ్ళిపోయారు. మనందరి ఆకాంక్షలకు అనుగుణంగా, అల్లాహ్ ఆయనకు అత్యద్భుతమైన పరలోక జీవితాన్ని ప్రసాదించాలని, ఆయన కుటుంబసభ్యులకు- ఇందులో మనమంతా ఉన్నాం- అందరికీ సహనం వహించే స్థిరచిత్తాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను... ఆమీన్! ❑


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# జనాబ్ అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై.) కొన్ని జ్ఞాపకాలు

**- ఖిజర్ ఖాన్**

**జనాబ్ అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై)** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఇస్లామీయ ఉద్యమంలో అందరికీ సుపరిచితులు. ఆయన మరణ వార్త నేడు అందరిని కలిచివేసింది. అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) అనేకసార్లు బాపట్ల పట్టణానికి విచ్చేసారు. పలుమార్లు మా ఇంటికి కూడా వచ్చారు. వయసు చిన్నదైనందున అప్పట్లో అంతగా పరిచయం ఏర్పడలేదు. కానీ గత మూడు సంవత్సరాలుగా ఆయనతో సన్నిహిత పరిచయం ఏర్పడింది. ప్రతి నెల రెండు మూడు సార్లు ఫోన్‌లో సంభాషణ జరిగేది. కొన్ని సార్లు ఫోన్ చేయటం ఆలస్యమైతే చిరునవ్వుతో చాలా రోజులయ్యింది ఫోన్ చేసి, నేను కూడా చేయలేక పోయాను అని చెప్పేవారు. అది ఒక విధంగా నాకు మందలింపుగా అనిపించేది. ఇస్లామీయ ఉద్యమ సభ్యులలో ఆయనది ప్రత్యేక స్థానం. వయసు, హెూదా అన్న భేదం లేకుండా అందరితో ఆప్యాయంగా పలకరించేవారు. మాట్లాడిన ప్రతి వ్యక్తి ఆయనను సన్నిహిత వ్యక్తిగా భావించే వారు.

అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) సుదీర్ఘ ఇస్లామీయ ఉద్యమ అనుభవం కలిగిన వ్యక్తి. ఉర్దూ, ఇంగ్లీష్, అరబిక్ భాషలలో ఆయన పుస్తక పఠనం చేసేవారు. అరబిక్ భాషలో ఆయన పి.హెచ్.డి. పరిశోధన వ్యాసం కూడా పూర్తి చేశారు కానీ అప్పటి కొన్ని కారణాల వలన పి.హెచ్.డి పట్టా పొందలేక పోయారు. చాలా ఎంపిక చేసి పుస్తకాలు పఠనం చేసేవారు. పాశ్చ్యాత రచయితల పుస్తకాలు కూడా చదివేవారు. అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) యవ్వనం నుండే ఇస్లామీయ ఉద్యమానికి అంకితం అయ్యారు. ఇస్లామీయ ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనేక ప్రాంతాలలో పటిష్ఠపరచటంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు.

అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) వ్యక్తిత్వం అనేక సద్గుణాల సమాహారం. జ్ఞానం, సహనం, నిరాండంబరత, మృదుత్వం వంటి అనేక మంచి లక్షణాలు ఆయనలో ఉన్నాయి. అతి తక్కువ మంది ఇటువంటి లక్షణాలు కలిసికట్టుగా కలిగి ఉంటారు. ఎదుటి వ్యక్తి సంభాషణను ఎంతో ఆసక్తిగా, పూర్తిగా వినేవారు. ఆ తర్వాత ఆయన సమాధానం చెప్పేవారు. ఉద్యమ కార్యక్రమాలు, బహిరంగ సభలు, చిన్న చిన్న ప్రాంతాల సమావేశాల్లో కూడా ఎంతో ఆసక్తిగా పాల్గొనే వారు. ఒకసారి బాపట్ల పట్టణం మా ఇంటికి వచ్చినప్పుడు నేనే అల్పాహారం జమాఅత్ బాధ్యుల ముందు ఉంచాను. అందరూ సేవించటం ప్రారంభించారు. అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) మొదట ఒక ప్లేటులో అన్ని రకాల తినే పదార్థాలు ఉంచి దానిపై మరొక ప్లేట్ కప్పి పెట్టి "బేటా!! మా డ్రైవర్ గారు బయట బండిలోనే ఉన్నారు ఎంత చెప్పినా లోనికి రాలేదు కాస్త ఆయన వద్దకు తీసుకువెళ్ళు అని అందచేశారు" ఆ తర్వాత ఆయన అల్పాహారం చేశారు. ఈ విధంగా తనతో ఉన్న ప్రతి ఒక్కరి గురించి శ్రద్ధ చూపేవారు.

అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) జమాఅతె ఇస్లామీ లక్ష్యాన్ని తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నారు. తుది శ్వాస వరకు ఆయన సేవలు అందిస్తూ ఉన్నారు. చివరి కొన్ని సంవత్సరాలు ఆయన ఉద్యమ ప్రయాణం, విధానాలు గురించి ఎంతగానో ఆలోచించేవారు. ఆయన చివరి వ్యాసం దానికి నిదర్శనం. అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై) సంభాషణ చేసేటప్పుడు ఆయన ప్రియ మిత్రులు ఎస్.ఎం. మలిక్ గారి ఆరోగ్యం గురించి కూడా ప్రస్తావించేవారు. ఉద్యమం, ఉద్యమ ప్రయాణం గురించి అనేక విషయాలు తెలియ చేసేవారు. రెండు రోజుల క్రితం అబ్దుల్ బాసిత్ అన్వర్ (ర.అలై)తో చివరి సంభాషణ జరిగింది. చివరగా ఆయన ఒక విషయం గురించి నవ్వుతూ నమాజ్ సమయం అయ్యింది మళ్ళీ మాట్లాడుకుందాం అని అల్లాహ్ హాఫిజ్ అన్నారు. ఆ చిరునవ్వే చివరి సంభాషణగా తీపి జ్ఞాపకంగా మిగిల్చారు. అల్లాహ్ ఆయనకు స్వర్గంలో ఉన్నత స్థానాలు ప్రసాదించుగాక... ఆమీన్. ❑



- యండి. ఉస్మాన్ ఖాన్

# జాతిని కదిలించిన ఉద్యమ నినాదాలు

**భారతదేశ** స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో మంది త్యాగధనులు తమ రక్తాన్ని, ప్రాణాన్ని ధారపోసి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు కూడా జరుపుకొన్నాం. ఈ సందర్భంగా ఉద్యమానికి స్ఫూర్తిని, ప్రేరణను అందించిన, శక్తివంతమైన కొన్ని నినాదాలను మననం చేసుకోవడం మన నైతిక కర్తవ్యం. సాధారణంగా రాజులు యుద్ధాలకు వెళ్ళేటప్పుడు శత్రు సైన్యాన్ని భయపెట్టే ఉద్దేశంతో రకరకాల ధ్వనులు, భీకరమైన శబ్దాలు, రణన్నినాదాలు చేస్తారు. అరుపులు, కేకలు, నినాదాలతో యుద్ధ మైదానం మార్మోగి పోతుంది. ఢమరుక నాదం, శంఖానాదాలతో తమ సైనికుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, శత్రు సైన్యంలో భయోత్పాతాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తారు. అటువంటి సాధనాలలో నినాదం ఓ ప్రముఖ ఆయుధం. 'క్విట్ ఇండియా' (1942) నినాదం మనందరికీ సుపరిచితం. ఇది భారతీయుల హృదయాల్లో ఎంతగా నాటుకు పోయిందో బ్రిటిష్ పాలకుల గుండెల్లో కూడా అంతగా గుచ్చుకు పోయి వారిని భయకంపితుల్ని చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ స్వాతంత్ర్యోద్యమాన్నే ఈ నినాదం ఓ మలుపు తిప్పింది. 'క్విట్ ఇండియా' ఇంతటి శక్తివంతమైన నినాద రూపకర్త యూసుఫ్ మెహర్ అలీ. ఉద్యమ సమయంలో ఆయన ముంబై మేయర్‌గా ఉన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన ఎనిమిది సార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యోద్యమానికి ఊపునిచ్చిన 'క్విట్ ఇండియా' అనే పదం నేపథ్యాన్ని చూసినట్లయితే, దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహ రచన చేస్తున్న మహాత్మాగాంధీ తన సహచరులతో ముంబైలో సమావేశమైనప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి పనికొచ్చే మంచి నినాదాలను సూచించాలని కోరారు. అప్పుడు ఒకరు 'గెటవుట్' అని అన్నారు. అది బాగా లేదని గాంధీజీ తిరస్కరించారు. 'రిట్రీట్ ఆర్ విత్‌డ్రా' అన్న పదాన్ని రాజగోపాలచారి సూచించగా, అక్కడే ఉన్న యూసుఫ్ మెహర్ అలీ 'క్విట్ ఇండియా' అనే పదాన్ని ప్రతిపాదించారు. గాంధీజీకి ఈ నినాదం అమితంగా నచ్చి, వెంటనే ఆ పదాన్ని ఆమోదించారు. అలాగే 'సైమన్ గోబ్యాక్' అనే విప్లవాత్మక నినాదం కూడా యూసుఫ్ మెహర్ అలీదే. ఈ నినాదం కూడా విపరీతంగా ప్రజల్లోకి చొచ్చుకు పోయింది. 1928లో నాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వ పాలన మెరగు పర్చేందుకు సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఒక్క భారతీయుడికీ స్థానం కల్పించలేదు. అందరూ బ్రిటిష్ అధికారులే ఉన్నారు. దీనికి నిరసనగా, 1928లో సైమన్ కమిషన్ ముంబై రేవులో దిగినప్పుడు యూసుఫ్ మెహర్ అలీ కొంత మందితో కలిసి కూలీల వేషంలో రేవుకువెళ్ళి 'సైమన్ గోబ్యాక్' అని గర్జిస్తూ నిరసన ప్రదర్శన చేశారు.

మరో స్ఫూర్తిదాయకమైన, చైతన్యశీల నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్'. ఈ నినాదాన్ని ప్రముఖ ఉర్దూకవి, ప్రఖ్యాత స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా హస్రత్ మోహానీ రూపొం

దించారు. ఈ నినాదం భగత్ సింగ్‌కు అమితంగా నచ్చింది. అత్యంత ప్రభావవంతమైన ఇంక్విలాబ్ జిందాబాద్ అనే ఈ నినాదాన్ని షహీద్ భగత్ సింగ్ విపరీతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటే.. విప్లవం వర్ధిల్లాలి. అని అర్థం. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాట రణ నినాదాలలో ఒకటిగా మారిపోయింది. భారతీయ యువతను స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేవిధంగా ప్రేరేపించింది. ఇది వారిలో దేశభక్తి భావనను, స్వాతంత్రేఛ్ఛను జాగృతం చేసింది. సత్యమేవ జయతే- ఈ నినాదాన్ని పండిట్ మదన్ మోహన్ మాలవీయ రూపొందించారు. ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది అనేది దీని అర్థం. దీన్ని మనం జాతీయ నినాదంగా స్వీకరించడమే కాకుండా మన జాతీయ చిహ్నం మీద కూడా ఇది రాయబడి ఉంటుంది.1918లో భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ పండిట్ మదన్ మోహన్ మాలవీయ ఈ నినాదాన్ని ఇచ్చారు. అలాగే, ఆసేతు హిమాచలం ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూ గించిన నినాదం 'జైహింద్'. దీన్ని హైదరాబాదుకు చెందిన ఆబిద్ హసన్ సఫ్రానీ రూపొందించారు. అతి కొద్దికాలంలోనే నేతాజీ ద్వారా ఈ నినాదం స్వాతంత్ర్య సమరయోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశభక్తులు తరచూ ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమాన మైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకు పోయింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య సమరానికి మద్దతు కూడగట్టేం దుకు జర్మనీ వెళ్లారు. ఆ సమయంలో జర్మనీ బ్రిటన్‌తో యుద్ధం చేస్తోంది. అదే సమయంలో అబిద్ కూడా తన ఇంజనీరింగ్ చదువు నిమిత్తం జర్మనీ వెళ్ళారు.

బోస్ ప్రసంగాలకు ప్రభావితమైన అబిద్ హసన్ తన ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరిపొయ్యారు.

బోస్ పునర్వ్యవస్థీకరించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో అబిద్ మేజర్‌గా కూడా పని చేశారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంత మంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలామలైకుం' అంటూ అభివాదం చేసుకునే వారు కూడా ఉండేవారు.

సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోద యోగ్య మైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని బోస్ తన సన్నిహితులకు చెప్పారు. అబిద్ ముందుగా 'హలో' అని ప్రతి పాదించారు కాని బోస్‌కు అది నచ్చలేదు. తర్వాత 'జై హిందుస్తాన్' 'జై హింద్' అనే నినాదాలను సూచించారు. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడంతో బోస్ 'జై హింద్'కే జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, విశేషంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఒక నినాదంగా మారి పోయింది. అదేవిధంగా.. మీరు నాకు రక్తాన్నివ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అని నినదించారు నేతాజీ. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ సైన్యంలో చేరాలని భారత యువతను కోరుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ నినాదాన్ని ప్రయోగించారు. మాతృభూమి కోసం తమ జీవితాలను త్యాగం చేయడానికి వేలాది యువ హృదయాలను ఈ నినాదం ప్రేరేపించింది. వేలాది మంది యువతీ యువకులకు ఈనినాదం ఒక రణ నినాదమై అయస్కాంతంలా యువతను ఆకర్షించి స్వాతంత్రోద్యమం వైపు పరుగులు తీయించింది


అలాగే.. స్వరాజ్యం నా జన్మహక్కు అనే నినాదం. కాకా బాప్టిస్టా పలికిన ఈ నినాదాన్ని బాల గంగాధర్ తిలక్ స్వీకరించారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశ ప్రేమికుల గుండెల్లో స్వతంత్ర జ్వాలలు రేకెత్తించారు. ఈ నినాదం దేశ ప్రజలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ప్రేరేపించడమే కాక, వేలాది మంది ప్రజల హృదయాల్లో దేశంపై ప్రేమను ఉరకలెత్తించింది. ముందే చెప్పుకున్నట్లు, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయు లకు అంతిమంగా ఇచ్చిన ఒక వార్నింగ్ 'క్విట్ ఇండియా'. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చేసిన బలమైన, అత్యంత గంభీరమైన నినాదం. బ్రిటిష్ వారిని ఒక్కసారిగా, స్పష్టంగా భారత దేశాన్ని విడిచిపెట్టమని చేసిన హెచ్చరిక. ఈ క్విట్ ఇండియా ఉద్యమం నుండి వచ్చిందే 'డూ ఆర్ డై' నినాదం. జాతీయ సమైక్యత, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాతంత్ర్య పోరాటం సాగుతుండగా గాంధీజీ ఇచ్చిన పిలుపు డూ ఆర్ డై ఉద్యమ కారుల్లో స్ఫూర్తిని నింపింది.

ఇవేకాకుండా ఇంకా ఇలాంటి అనేక నినాదాలు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాయి. మన స్వాతంత్ర్య సమర యోధులు చేసిన నినాదాలు శత్రు హృదయాల్లో భీతిని కలిగించి మాతృభూమిని పరాయి బానిసత్వం నుండి విముక్తి చేశాం ❖

# కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు

**- వాహెద్**

**(గత సంచిక తరువాయి)**




కన్యాశుల్కంలో ఉర్దూ పదాలను, అవి వాడకంలోకి ఎలా వచ్చా యన్నది అర్థం చేసుకోడానికి బ్రౌన్ తన మిశ్రమ నిఘంటువు ముందుమాటలో రాసిన విషయాలు కూడా ఒక్కసారి చూడడం అవసరం. ఈ నిఘంటువు 1854లో అచ్చయ్యింది. సుదీర్ఘకాలంగా కొనసాగిన ముస్లిముల పరిపాలన వల్ల అనేక భారతీయ భాషల్లో విదేశీ పదాలు వచ్చాయని ఆయన రాశాడు. ఆయన పేర్కొన్న విదేశీపదాలు పారశీక, అరబ్బీ, టర్కీ పదాలు. తర్వాతి కాలంలో ఇంగ్లీషు పదాలు కూడా తెలుగు వాడకంలో వచ్చాయని రాశారు. అందుకు ఉదాహరణగా ఆయన కోర్టులో రాసిన ఒక ఎంట్రీ ఇచ్చారు. అందులో భాష చూడండి.

ఈ నెంబరులో డిఫెండెంటు సమ్మను చూచి సైను చేశి వాయిదా చొప్పున కోర్టులో హాజరు అయి ఆన్సరు యియ్యకపోయినందున యిందులో యెక్సపార్టీ దర్యాప్తు చేయవలెనని ప్లేంటిఫ్ ప్లీడరు మోశను చేశినాడు గనుక ఆ మోశను రికార్డులో దాఖలు (or ఫయిలు) చేసి అందులో దరా?స్తు చేసిన చొప్పున నడిపించేలాగున ప్రొసీడింగుసులో ఆర్డరు ఎంటరు చేయడం అయినది.''

తెలుగు కోర్టుల డైరీల్లో ఇలాంటి ఉదాహరణలు దొరుకుతాయని ఆయన రాశాడు.

ఈ భాష అప్పటి భాష. ఇక్కడ గమనించవలసిన విషయమే మంటే, ఈ ఉదాహరణలో సైను అన్న ఇంగ్లీషు పదం అర్థం కావడానికి దస్కత్ అన్న ఉర్దూ పదం బ్రాకెట్‌లో వాడారు. దాఖలు అన్న ఉర్దూ పదానికి బ్రాకెట్లో ఫైలు అన్న ఇంగ్లీషు పదం వాడారు. ఇవి మాత్రమే కాక మొత్తం ఈ నాలుగు పంక్తుల్లో ఐదారు ఉర్దూ పదాలున్నాయి. అంతేకాదు ఈ ఉదాహరణ ద్వారా అర్థమవుతున్న మరో వాస్తవమేమంటే అప్పట్లో న్యాయస్థానాల రాతకోతల్లో తెలుగు వాడుకభాషలోనే జరిగేవి. అంటే పాలనా పరమైన రాతకోతలన్నీ తెలుగులో రాయవలసి వస్తే వాడుక భాషలోనే జరిగేవి.

1854 నాటి బ్రౌన్ నిఘంటువులో ఈ ఉదాహరణ ఇచ్చారంటే అంతకు ముందు చాలా కాలంగా ఈ భాష రాతకోతల్లో వాడుకలో ఉంది. కాని విచిత్రమేమంటే, 1864లో జన్మించిన గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషోద్యమం నడపవలసి వచ్చింది. గురజాడ రాసిన ముందు మాటలు కూడా ఈ సందర్భంగా గమనించాలి. 1862లో గురజాడ జన్మించారు. 1889 ప్రాంతంలో ఆయన ఈ నాటకాన్ని రాస్తూ ఉన్నారు. ఆయన మొదటి కూర్పుకు రాసిన ముందుమాటలో ఏమన్నారో చూద్దాం.

కన్యాశుల్కం దురాచారం వల్ల తలెత్తిన పరిస్థితిని విమర్శిస్తూ రాసిన తర్వాత, ఈ నాటకాన్ని తాను వాడుకభాషలో రాస్తున్నానని చెప్పారు. తెలుగులో నాటకసాహిత్యం లేదు కాబట్టి నాటకానికి తగిన డిక్షన్ ఎన్నుకునే స్వేచ్ఛ తనకు ఉందని చెబుతూ తెలుగు సంభాషణలు రాయడానికి గ్రాంధికం పనికిరాదని అన్నారు. ఇలా

రాయడాన్ని "వల్గర్" అంటూ వచ్చే విమర్శలు పట్టించుకోనవసరం లేదని చెప్పారు. ఛందోబద్ధమైన పద్యప్రయోగాలను, సంస్కృత సమాస భూయిష్టమైన ప్రయోగాలను కూడా ఆయన తీవ్రంగా తన ముందుమాటలో నిరసించారు. వీరేశలింగం పంతులుగారి బ్రహ్మ వివాహం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. రెండవ కూర్పుకు రాసిన ముందుమాటలోను ఈ విషయాలను ప్రస్తావించడం మాత్రమే కాదు తెలుగులో సాధారణంగా రచయితే ప్రచురణకర్తగా ఉంటాడని చెప్పారు. నేటికి అదే పరిస్థితి ఉంది. ఈ ముందుమాటలు కన్యాశుల్కంలో ఉన్నాయి. కాబట్టి ఇక్కడ విస్తారంగా రాయనవసరం లేదు. కాని అర్థం చేసుకోవలసిన విషయమేమంటే, వాడుకభాషలో ఉన్న పదాలను నిస్సంకోచంగా రాయడమే కాదు, స్పెల్లింగు విషయంలోను ప్రజలు ఎలా మాట్లాడుతున్నారో అలాగే ఆయన రాశారు. 1854లో పాలనా పరమైన వ్యవహారాల్లో రాతకోతలు వాడుకభాషలోనే జరుగుతున్నప్పటికీ సాహిత్యం వాడుకభాషలో రాయడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది. ఎంత దురదృష్టం. ఈ దురదృష్టకరమైన పరిస్థితి నేటికి కూడా కొనసాగుతోంది. తెలుగులో కలిసిపోయిన ఇంగ్లీషు పదాలు అనేకం ఉన్నాయి. కాని కొత్తగా వస్తున్న ఇంగ్లీషు పదాలకు తెలుగు పదాలు తయారు చేయాలన్న ఉత్సాహం, తెలుగును ప్రక్షాళన చేసే ప్రయత్నాలతో అర్థం కాని సంస్కృత పదాల సమాసాలు వస్తున్నాయి.

కన్యాశుల్కంలో వాడిన భాష ఆ కాలంలో ఉత్తరాంధ్రలో వాడుకలో ఉన్న భాష. 1980లో బండి గోపాలరెడ్డి గారు కన్యాశుల్కంలో ఎన్నో పదాలకు వివరణాత్మకమైన ఫుట్ నోట్స్ రాసి ప్రచురించారు. అది మొదటి కూర్పుకు సంబంధించినది. 1991లో కే.వీ.రమణా రెడ్డి గారు రాసిన కన్యాశుల్కం టీకా.. టిప్పణి ప్రచురించారు వెలుగు రామినీడు గారు. ఈ పుస్తకాల సహాయంతో కన్యాశుల్కం పదాలను అర్థం చేసుకుని చదవవచ్చు. అయితే కొన్ని పదాలకు, ముఖ్యంగా ఉర్దూ నుంచి వచ్చిన పదాలకు వివరణ అవసరమే. అలాగే పూర్తిగా రూపం మారిపోయిన పదాలున్నాయి. ఉర్దూ వాళ్ళు విన్నా కూడా వారికి ఆ పదం తమ భాష నుంచే వచ్చిందని తెలియదు.

యజమాని అన్న పదం మనకు తెలిసిందే. జజ్మాన్ అన్న పదం నుంచి ఇది వచ్చింది. యవడికిక్కడికి రావడానికి మగదూరు ఉంది అంటాడు గిరీశం. మఖ్దూర్ అన్న పదం ఉర్దూలో ఉంది. నిజానికి అక్కడ అక్షరం ఖ కాదు. ఇది క, గ అక్షరాలకు మధ్యస్థంగా ఉచ్చరించే అక్షరం. ఖుద్రత్ అంటే శక్తి, బలం అని అర్థం. మఖ్దూర్ అంటే శక్తి కలిగిన వాడు, దమ్మున్నవాడన్న భావం. అలాగే తస్సా అనే పదం. గర్వం, ఆడంబరం, ముద్ర, అచ్చు, మూస వగైరా అర్థాల్లో ఉర్దూలో వాడతారు. కాని గురజాడ తస్సా చెప్పి రంజింపజేద్దాం అని రాశారు. ఖిస్సా అంటే కథ అనే అర్థంతో వాడారు. ఈ పదాన్ని మరో చోట "ఒక తస్సా వేశామంటే అది బ్రహ్మభేద్యంగా ఉండాలి"అంటాడు గిరీశం. ఇక్కడ కూడా అదే అర్థంతో వాడారు. తస్సా వేసుక్కూర్చోవడం అంటే మొండికేయడం అన్న అర్థాన్ని బ్రౌన్ ఇచ్చారు. ఈ పదం వాడకంలో కట్టుకథ అన్న భావాన్ని సంతరించుకుని ఉండవచ్చు. ఎందుకంటే గురజాడ రెండు చోట్ల కూడా కట్టుకథ అన్న భావంతోనే వాడారు. అలాగే కదపాయించడం అన్న పదం కూడా గమనించదగింది. కదప అంటే కౌంటర్ అగ్రిమెంట్ అన్న అర్థాన్ని బ్రౌన్ ఇచ్చారు. ఈ పదం ఉర్దూ నుంచి వచ్చిందిగా కనబడుతోంది. కాని అసలు పదమేమిటో బ్రౌన్ ఉర్దూ స్పెల్లింగు ఇవ్వలేదు. బేరీజు అనే పదం బేరీజ్ నుంచి వచ్చింది. దీనికి లెక్కించడం, ఎస్సెస్ మెంట్ అన్న అర్థాలున్నాయి. మేజువాణి అనే పదం కూడా తెలుగులో కాస్త అర్థం మారి స్థిరపడింది. మేజ్బాన్ అంటే ఆతిథ్యం ఇచ్చేవాడు. హోస్ట్ అని భావం. అలాగే మేజ్బాన్ అంటే ఎంటర్ టైనర్ అనే అర్థం కూడా ఉంది. మేజ్బానీ అంటే ఆతిథ్యం ఇవ్వడం, హోస్టు చేయడమూ అని అర్థం. అది వినోదకార్యక్రమానికి కూడా కావచ్చు. ఈ అర్థంతోనే తెలుగులో మేజువాణి అయ్యింది. మేజువాణి గురించి చెప్పినప్పుడు మూజువాణి గురించి కూడా చెప్పాలి. మూజబాని అంటే నోటిమాట. అదే మూజువాణి అయ్యింది. పెళ్ళి కూతురిని ఇలాకా చేసుకుని అంటాడు గిరీశం. ఇలాకా అంటే ప్రాంతం అన్న అర్థమే కాదు, తన పనికి వాడుకునే ప్రయత్నం, అందుకు అవసరమైన సంబంధం వగైరా అర్థాలున్నాయి. దుబారా అనేది దోబారా నుంచి వచ్చింది. దోబారా అంటే మరోసారి అని అర్థం. మళ్ళీ మళ్ళీ అవసరం లేని ఖర్చులు దుబారా ఖర్చులయ్యాయి. తెరవెనుక నుంచి హంగు చేస్తాను అంటుంది మధురవాణి. ఇక్కడ హంగు అనే పదం ఉర్దూ ఢంగ్ నుంచి వచ్చింది. ఢంగ్ అంటే ఉపాయం, పద్ధతి వగైరా అర్థాలున్నాయి. తెర వెనుక నుంచి ఉపాయం చేస్తాను అన్న భావంతో వాడారు. కాకితమైతే అగ్గిపుల్లతో ఫైసల్ అంటాడు రామప్పంతులు. కాగితం, కాకితం కూడా ఉర్దూ మూలపదం కాగజ్ నుంచి వచ్చినవే. కుమ్మక్కు అనే పదం యథాతథంగా ఉర్దూ నుంచి వచ్చింది. కుమక్ అంటే సహకరించడం, తోడ్పాటు అందించడం. ఏజన్సీ కమాన్ చేస్తున్నప్పుడులో కమాన్ అనే పదం ఫ్రెంచ్ కమాండ్, మిలిటరీ జర్నీ నుంచి వచ్చిందని బ్రౌన్ రాశారు. కమాన్ అంటే విల్లు అని అర్థం ఉంది. కమాన్ దార్ అంటే విల్లు చేబూనినవాడు. కమాన్ పర్ జానా అంటే సైనికవిధులకు వెళ్ళడం అని భావం ఉర్దూలోను ఉంది. ఇంగ్లీషులో కమాండ్ అంటే అధికారం అనే భావంతో కూడా ఉర్దూలో కమాన్ వాడతారు. కమాన్ కర్నా అంటే నాయకత్వం వహించడం అన్న అర్థముంది. ఏమైనా ఉద్యోగ విధుల్లో ప్రయాణమవ్వడం అన్న అర్థంతో వాడినట్లు తెలుస్తోంది.

**(ఇంకా వుంది...)**

# ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్




**ఉత్తరప్రదేశ్**‌లోని హర్దోయిలో డజను మంది మూక ఒక యువకుడిని చావగొడుతున్న వీడియో వైరల్ అయ్యింది. రైల్వే గేట్ మ్యాన్‌ను ముస్లిం జిహాదీలు చావగొడుతున్నారని ఈ వీడియోతో పాటు ప్రచారం చేశారు. రైల్వే గేటు మాన్‌ను చావగొడుతూ వీడియో తీసి జిహాదీలు గర్వంగా అప్ లోడ్ చేశారని ఈ ప్రచారంలో పేర్కొన్నారు. ఈ వీడియో గురించి ఇండియాటుడే పత్రిక విచారణ జరిపింది. ఈ వీడియోలో బాధితుడు రైల్వే గేట్ మ్యాన్ కాదని తేలింది. ఈ ఘర్షణ ఒక రోడ్డు ప్రమాదం వల్ల చోటు చేసుకుందని తెలిసింది. అగష్టు 13వ తేదీన యుపితక్ చానల్‌లో ఈ వివరాలు వచ్చాయి. అగష్టు 11వ తేదీన హర్దోయి లోని రైల్వే ట్రాక్ వద్ద ఈ సంఘటన జరిగింది. ఈ వార్త ప్రకారం మహ్మూద్‌పుర్‌కు చెందిన సబా హైదర్ అనే వ్యక్తి పొరబాటున పర్వీన్ అనే మహిళను ఢీకొట్టాడు. ఆమె సరాయా గ్రామానికి చెందినది. ఆ తర్వాత అతను అక్కడి నుంచి పారిపోయాడు. తన మోటారు సైకిలు కూడా వదిలేసి పారిపోయాడు. కాని అతను ఇంటికి చేరుకునే సరికి బాధితురాలు పర్వీన్ కుటుంబసభ్యులు ఇంటివద్ద అతన్ని పట్టుకుని కొట్టారు. సబా హైదర్ తర్వాత తన దుకాణానికి వెళ్ళాడు. కాని పర్వీన్ కుటుంబసభ్యులు అతన్ని రైల్వే ట్రాకు వద్ద పట్టుకుని మళ్ళీ కొట్టారు. ఎవరో ఈ ఘర్షణను వీడియో తీసి అప్ లోడ్ చేశారు. హర్దోయి ఏయస్పీ దుర్గేష్ సింగ్ ప్రకారం ఒక రోడ్డు ప్రమాదం వల్ల జరిగిన ఘర్షణ ఇది. బాధితుడు, దాడి చేసినవారు అందరూ ఒకే సముదాయానికి చెందినవారు. ఇందులో దెబ్బలు తింటున్నది రైల్వే గేట్ మ్యాన్ కానే కాదు. ఇలాంటి అబద్ధాలు ప్రచారం చేసి ప్రజల్లో విద్వేషాన్ని పెంచడానికి జరుగుతున్న ప్రయత్నాల పట్ల అందరూ జాగ్రత్త వహించవలసిన అవసరం ఉంది.

మరో ఫేక్ వార్త చూద్దాం. షమా బిర్యానీ ధాబా అనే హోటలులో బిర్యానీ వండడానికి మురికినీళ్ళను వాడుతున్నారని, మురికి కాల్వలో నీటితో బిర్యానీ వండుతున్నారని ప్రచారం సోషల్ మీడియాలో వచ్చింది. ఈ వీడియోలో ఒక బిర్యానీ హోటలు నడుపుతున్న వ్యక్తితో కొందరు గొడవపడుతూ, అతన్ని నెట్టడం, కొట్టడం కనిపిస్తుంది. ఈ వీడియోలో మురికి కాల్వ కూడా చూపించారు. సుదర్శన్ న్యూస్ అనే ఫేకు వార్తల ఫ్యాక్టరీ జర్నలిస్టు సాగర్ కుమార్ ఈ వీడియోను షేర్ చేస్తూ "జిహాదీలు ఉమ్మేయడంతో ఊరుకోవడం లేదు. మురికికాల్వ నీటితో బిరియానీ వండుతున్నారు" అని రాశాడు. ముస్లిములు పండ్లు కూరగాయలపై ఉమ్మేస్తున్నారనే ప్రచారం కూడా ఇలాంటి అబద్ధపు ప్రచారమే అన్నది ఇంతకు ముందు అనేకసార్లు నిజనిర్ధారణ వార్తా సంస్థలు నిరూపించాయి. ఈ షమా బిరియానీ ధాబా హర్యానాలోని పింజోర్ పట్టణంలో ఉంది. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, ప్రతిరోజు మురికి నీటిని తీసేసే మనిషి రెండు రోజులుగా రాలేదు. అందువల్ల మురికినీరు పొంగి ప్రవహిస్తోంది. దేశంలో చాలా చోట్ల మురికినీరు పొంగి ప్రవహించే దృశ్యాలు మనకు కనిపిస్తూనే ఉంటాయి. ఈ పొంగి ప్రవహిస్తున్న నీటిని తీసేయడానికి షమా బిరియానీ ఢాబా యజమాని ఒక మోటారు పెట్టి ఆ నీటిని తోడి శుభ్రం చేసే ప్రయత్నం చేశాడు. బిరియానీ వండడానికి వాడే నీరు ఎక్కడి నుంచి వస్తుందో కూడా ఆ హోటలు యజమాని నిజనిర్ధారణ సంస్థలకు చూపించాడు. పింజోరి పోలీసులు కూడా ఇది నిర్ధారించారు. మురికికాల్వ నీటిని ఆ హోటలు బిరియానీ వండడానికి ఉపయోగిస్తుందనే మాటలో నిజం లేదన్నారు. ఇలాంటి అబద్ధపు వార్తల ప్రచారం చేసిన వారికి ట్వీటుకు కొంత సొమ్ము దొరుకుతుందనే ఆరోపణలు కూడా ఇప్పుడు వినిపిస్తున్నాయి.

ఇక ఇంకో ఫేక్ వార్త చూద్దాం. దేశంలో మనం ఎంతో గర్వంగా, వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నాం. దుబాయిలో కొందరు భారత స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వీడియో వైరల్ అయ్యింది. దుబాయి పోలీసులు భారత స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నారని రాశారు. ఈ వీడియోను దుబాయిలో ఉన్న ఇక్బాల్ హత్బూర్ అప్ లోడ్ చేశాడని దిక్వింట్ నిజనిర్ధారణలో తేలింది. ఈ వీడియోలో ఎక్కడా దుబాయి

యువరాజు ప్రిన్స్ హందాన్ బిన్ ముహమ్మద్ అల్ మక్తూమ్ లేడు. ఈ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఏర్పాటు చేసింది హత్బూర్ అనే వ్యక్తి, అంతేగాని దుబాయి పోలీసులు కాదు. హత్బూర్ తమ స్వతంత్ర దినోత్సవ వేడుకల వీడియోను ఫేస్ బుక్‌లోను, ఇన్‌స్టాలోను అప్ లోడ్ చేశాడు. బుర్జ్ ఖలీఫా వద్ద తాము భారత స్వతంత్ర దినోత్సవ వేడుకలు చేసుకున్నామని రాసుకున్నాడు. ఇతను కేరళకు చెందిన వ్యక్తి కాబట్టి మాతృభూమి చానల్ కూడా ఈ వార్తను ప్రసారం చేసింది. దుబాయి పోలీసులు ఈ కార్యక్రమంలో ఎక్కడా లేరు. అయినా దుబాయి పోలీసులు, దుబాయి యువరాజు గర్వంగా మన స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారని రాయడం ఎందుకు? దీనివల్ల సాధించిందేమిటి? అంతర్జాతీయంగా మన ప్రతిష్ఠను అబద్ధాలతో దిగజార్చడం తప్ప.

మరో వార్త చూద్దాం. గాంధీని, నెహ్రూను అవమానించడం లేదా వారిని అప్రతిష్ఠ పాలు చేయడం ఇప్పుడు అబద్ధాలు ప్రచారం చేసే ఫేక్ వార్తల ఫాక్టరీకి ఎంతో ఇష్టమైన పని. దీనివల్ల ఎవరికి రాజకీయ ప్రయోజనాలున్నాయన్నది కాస్త ఆలోచిస్తే అర్థం కానిది కాదు. జాతిపితగా పేరుపడిన గాంధీజీ నిజానికి బ్రిటీషు వారి ఏజంటని, ఆయన్ను బ్రిటీషు వారు దక్షిణాఫ్రికా నుంచి ఇక్కడికి తీసుకువచ్చారని ఒక ప్రచారం సోషల్ మీడియాలో ప్రారంభ మయ్యింది. నేషనల్ ఆర్కియివ్స్‌లో ఒక లేఖ దొరికిందని, ఆ లేఖ ప్రకారం బ్రిటీషు వారు 1930లో గాంధీజీకి నెలకు వంద రూపాయల పారితోషికం చెల్లించేవారని రాశారు. అప్పట్లో వంద రూపాయలంటే ఇప్పుడు మూడు లక్షలకు సమానమని కూడా రాశారు. బ్రిటీషువారికి ఏజంటుగా పనిచేసినందుకే ఈ మొత్తం చెల్లించేవారని, గాంధీ నెహ్రూలు బ్రిటీషు ఏజంట్లని ప్రచారం ప్రారంభించారు. ది క్వింట్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో తెలిసిందే మిటంటే గాంధీజీకి బ్రిటీషు వారు ఈ మొత్తం చెల్లించిన ఆధారాలు ఏవీ లేవు. ఈ ప్రచారంలో పేర్కొంటున్న లేఖ నిజానికి గాంధీజీ యరవాడ జైలులో ఉన్న కాలానికి సంబంధించింది. దండి సత్యాగ్రహం తర్వాత ఆయన్ను రాజకీయ ఖైదీగా అక్కడ నిర్బంధించారు. ఈ జైలు కాలంలో ముంబయి ప్రభుత్వం యరవాడ జైలు సూపరిండెంటుకు ఉత్తర్వులు జారీ చేసి గాంధీజీకి వంద రూపాయలు ఖర్చులకు చెల్లించాలని ఆదేశిం చింది. గాంధీజీ 'Regulation XXV of 1827' క్రింద నిర్బంధిం చారు కాబట్టి ఈ మొత్తం ఆయనకు చెల్లించవలసి వచ్చింది. బెంగాల్ రాజకీయ ఖైదీ సతీష్ చంద్ర పక్రాషీకి కూడా ఇలాగే చెల్లించారు. గాంధీజీ మేజర్ డోయల్‌కు రాసిన లేఖలో ఆ సొమ్ము తాను తీసుకోలేనని చెప్పారు. క్లుప్తంగా తెలుస్తున్నదే మిటంటే, గాంధీజీకి బ్రిటీషువారు నెలకు వంద రూపాయలు చెల్లించే వారన్నది అబద్ధం. పూనేలోని యరవాడ జైలు సూపరిండెంటుకు నెలకు వంద రూపాయలు గాంధీజీ వ్యక్తిగత ఖర్చుల కోసం వాడాలని ఇచ్చేవారు, ఆ సొమ్ము నుంచి తనకేమి ప్రత్యేకంగా ఖర్చు చేయవలసిన అవసరం లేదని గాంధీజీ నిరాకరించారు. రాజకీయ ఖైదీలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు, వ్యక్తిగత ఖర్చులు చెల్లించడం జరిగేదని కూడా తెలుస్తోంది. గాంధీ నెహ్రూలకు వ్యతిరేక ప్రచారం చేయడం ఫేక్ వార్తల ఫాక్టరీకి చాలా ఇష్టమైన పని. ఎందుకన్నది ఎవరికి వారే ఆలోచించుకోవచ్చు.

మరో ఫేక్ వార్త చూద్దాం. భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గురించి ఫేక్ వార్త ఇప్పుడు ప్రచారంలో పెడుతు న్నారు. ప్రభుత్వాన్ని ఎదుర్కోడానికి ప్రజలు రోడ్లపైకి రావాలంటూ ఆయన పిలుపు ఇచ్చారని ఈ ఫేక్ వార్త సారాంశం. కాని ఆయన అలాంటి పిలుపు ఏదీ ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ఫేక్ వార్త వాట్సప్ యూనివర్శిటీలో ప్రచారంలో వచ్చింది. సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇప్పుడు కశ్మీరులో అధికరణ 370 రద్దు కేసు విచారిస్తోంది. ఈ ధర్మాసనానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వం వహిస్తున్నారు. అధికరణ 370 రద్దుపై అనేక పిటీషన్లు సుప్రీంకోర్టుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ వైరల్ వార్త వచ్చింది. న్యూస్ చెకర్ నిజనిర్ధారణ ప్రకారం ఇలాంటి వ్యాఖ్య ఏదీ ఎన్నడూ ప్రధాన న్యాయమూర్తి చేయలేదు. సుప్రీంకోర్టు ఈ వైరల్ వార్తను ఖండిం చింది. సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఇది ఫేక్ వార్త అన్నారు. మరింత లోతుగా ఈ విషయాన్ని పరిశీలించిన తర్వాత ఫాక్ట్ చెకర్ తెలుసుకున్నదేమిటంటే, నవంబరు 2022లో చంద్రచూడ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బాంబే హైకోర్టులో జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ 1975 ఎమర్జన్సీ రోజుల్లో నిర్భయంగా పనిచేసిన కోర్టులే భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడాయని అన్నారు. రాణే వంటి న్యాయమూర్తులు నిర్భయంగా వ్యవహరించారని చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన 2020లో మాట్లాడుతూ నిరసనలు ప్రజాస్వామ్యంలో సేఫ్టీ వాల్వులుగా పనిచేస్తాయని వ్యాఖ్యానించారు. నిరసనలను బల ప్రయోగంతో అణిచేయాలని చూడడం వల్ల భయాందోళనలు వ్యాపిస్తాయని, దీనివల్ల చట్టబద్ధ పాలన దెబ్బతింటుందని చెప్పారు. నిరసనలను జాతివ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలుగా ముద్ర వేయడం వల్ల రాజ్యాంగ విలువలను కాపాడడం దెబ్బతింటుందని చెప్పారు. కాని ఈ వ్యాఖ్యల్లో ఎక్కడా ఆయన ప్రజలను రోడ్లపైకి రావాలని చెప్పిన మాట లేదు.

ఇలాంటి ఫేక్ వార్తలు, అబద్ధాలు ప్రచారం పెట్టడమే పనిగా చాలా మంది బతుకుతున్నారని ఈ వార్తలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

13 ఆయన మీ కొరకు నిర్దేశించిన ధర్మ విధాన ఆదేశమే నూహ్‌కు ఇచ్చాడు, దాన్ని (ముహమ్మద్!) ఇప్పుడు నీ వద్దకు మేము వహీ ద్వారా పంపాము; దానినే మేము ఇబ్రాహీమ్, మూసా, ఈసాకు బోధించి ఉన్నాము, స్థాపించండి ఈ ధర్మాన్ని, అందులో విభేదించుకోకండి[20] అన్న గట్టి నిర్దేశనతో. (ముహమ్మద్!) దేని వైపునకు నీవు వీరికి పిలుపు నిస్తున్నావో ఆ విషయమే ఈ బహుదైవారాధకులకు తీవ్రంగా అయిష్టకరమయినది. అల్లాహ్ తాను కోరిన వానిని తన వానిగా చేసుకుంటాడు; తన వద్దకు చేరే దారినీ ఆయన, తన వైపునకు మరలేవారికే చూపిస్తాడు.

**(20వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

దాని అర్థం, అతను దేశ ప్రజల్ని తన విధేయులుగా చేసుకున్నాడు, ప్రభుత్వ విభాగాలన్నింటినీ వ్యవస్థీకరించి దేశపరిపాలన అంతా తన ఆదేశాల కనుగుణంగా నడిచేలా మలచుకున్నాడు అని వస్తుంది. అదే విధంగా దేశంలో న్యాయస్థానాలు నెలకొల్పబడ్డాయి అని అంటే అర్థం, న్యాయం చేకూర్చడానికి న్యాయ మూర్తులు నియమితులయి ఉన్నారు, వారు కేసుల విచారణ జరుపుతున్నారు, తీర్పులు చేస్తున్నారు అని భావం. అలాకాక కేవలం న్యాయం చట్టాల మేళ్ళు బహువిధాలుగా వివరించడం జరుగుతోంది, జనం వాటిని స్వీకరించడం కూడా జరుగుతోందని అర్థం కాదు. అలాగే దివ్య ఖుర్‌ఆన్‌లో నమాజ్‌ని స్థాపించాలని ఆదేశమిస్తే దాని అర్థం నమాజ్‌కు ఆహ్వానం, దాని ప్రచారమని కాదు. దాని అర్థం, నమాజ్‌ని దాని నియమ నిబంధనలనన్నింటినీ పాటిస్తూ స్వయంగా ఆచరించడమేకాక, విశ్వసించిన వారిలో అది నియమబద్ధంగా అమలులోకి వచ్చేలా అన్ని ఏర్పాట్లూ జరగాలి. మస్జిదులు కావాలి, జుమా నమాజ్, జమాఅత్‌తో పాటు సామూహిక నమాజ్ చేసుకునే ఏర్పాటు కావాలి. నియమానుసారంగా అజాన్ పిలుపునిచ్చే ఏర్పాటు ఉండాలి. ఇమామ్, జుమా ప్రసంగం చేసే వక్తలు నియ మించబడాలి. జనులకు సమయానికి మస్జిద్‌కు వచ్చి నమాజ్‌ని ఆచరించే అలవాటు కలగాలి. ఈ వివరణల వల్ల ఇక ఈ విషయం అవగతం చేసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది మిగులరాదు. ప్రవక్తలందరికీ ఈ ధర్మాన్ని స్థాపించాలనీ, స్థాపితంగా కాపాడాలని ఆదేశమిచ్చినప్పుడు దాని ఉద్దేశం కేవలం స్వయంగా వారు ఈ ధర్మాన్ని ఆచరించాలన్నది మాత్రమే కాదు, ఇంకా కేవలం ఇతరు లలో దీన్ని ప్రచారం చేయాలన్నదీ, వారు దీన్ని సత్యమయినదిగా స్వీకరించాలన్నది కూడా కాదు. నిజానికి జనం దీన్ని స్వీకరించి నప్పుడు ముందుకు అడుగువేసి ఈ ధర్మాన్ని సంపూర్ణంగా వారిచేత అనుసరింపజేయాలి. ఈ ధర్మానికనుగుణంగా అమలు జరిగేలా, అమలు జరుగుతూ ఉండేలా చేయడం అన్న భావమూ అందులో ఇమిడి ఉంది. అయితే సందేశ ప్రచార కార్యక్రమం దీనికి తప్పనిసరి దశ అన్నది సందేహరహితమయిన విషయమే. అది లేకుండా రెండవ దశ ముందుకు అసలే సాగదు. కాని ఈ ఆదేశంలో సందేశ ప్రచారమే అసలు ఉద్దేశంలా పేర్కొనడం జరగలేదు. ఈ విషయం బుద్ధిగల ఏ వ్యక్తి అయినా స్వయంగా గమనించగలడు. సందేశప్రచారం అసలు ఉద్దేశ్యాన్ని సాధించ డానికి మార్గం అన్నది మటుకు నిస్సందేహంగా వాస్తవం. కాని స్వయంగా అదే అసలు ఉద్దేశ్యం కాదు. ఎవరయినా సందేశ ప్రచారాన్ని మాత్రమే ప్రవక్తలందరి ఏకైక ధ్యేయం అని నిర్ణయిం చడం విడ్డూరం.

ఇక రెండవ ప్రశ్నను తీసుకోండి ఏ ధర్మాన్ని స్థాపించాలని ఆదేశ మయిందో అది ప్రవక్తలందరి (అలైహిముస్సలామ్) మధ్యన సమిష్టి ధర్మమే అయినా షరీఅత్‌లు (శాసనాంగాలు) అందరివీ భిన్నమయినవని కొందరు గమనించారు. దేవుడు స్వయంగా సెలవిచ్చినట్లు "(మేము మీలో ప్రతి సముదాయానికి ఒక షరీఅత్ (ధర్మశాస్త్రం) ఒక మార్గం నిర్ణయించాము)" (అల్ మాఇద: 48). దీన్నిబట్టి వారు స్థాపించవలసిన ధర్మం అంటే ఉద్దేశం షరీఅత్ ఆదేశాలు కావు, కేవలం దేవుని ఏకత్వం, పరలోకం, గ్రంథం, దైవదౌత్యాలను నమ్మడం, దైవారాధన నిర్వర్తించడం, మహా అయితే అందరికీ సమిష్టిగా వర్తించే ప్రముఖమయిన నైతిక సూత్రాలూ ఇందులో చేరి ఉన్నాయని తలంచారు. కాని ఇది చాలా స్థూలమయిన అభిప్రాయం. ఇది కేవలం స్థూల దృష్టితో ధర్మం అన్నది ఒక్కటే అని, షరీఅత్‌లు (ధర్మశాస్త్రాలు) భిన్న మయినవని చూసి ఏర్పరచుకున్న అభిప్రాయం. ఇది చాలా ప్రమాదకరమయిన అభిప్రాయం కూడా. దీన్ని సంస్కరించక పోతే ముందుకు సాగి అది ధర్మంలోనూ ధర్మశాస్త్రంలోనూ విభేదాలు సృష్టించేవరకు వెళ్ళే ప్రమాదముంది. ఈ ప్రమాదానికి గురయ్యే సెయింట్ పౌలు (St. Paul) "ధర్మ శాస్త్రం లేని మతం" సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. తద్వారా మహనీయ ఈసా మసీహ్ (క్రీస్తు) సముదాయాన్ని చెరిపి వేశాడు.

**(20వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَنَاقِبِ

## 2. మహిమోన్నతుల ప్రకరణం (కితాబుల్ మనాఖిబ్)

### అధ్యాయం : 25

### మహాప్రవక్త(స) అద్భుతాల గురించి

**224)** హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం: ఈయన ఒక ప్రయాణంలో దైవప్రవక్త(సఅసమ్) వెంట ఉన్నారు. రాత్రంతా జనులు నడుస్తూనే ఉన్నారు. మరి కాస్సేపట్లో తెల్లవారుతుందనగా దైవప్రవక్త(స) ఒకచోట విడిది చేశారు. (మేము అప్పటికే బాగా అలసిపోయి ఉన్నాము. అందువల్ల) అందరూ గాఢనిద్రలోకి జారుకున్నారు. సూర్యోదయం అయ్యేవరకూ ఎవరికీ మెలకువ రాలేదు. ఎట్టకేలకు అందరికంటే ముందు హజ్రత్ అబూబక్ర్(రజి) మేల్కొన్నారు. అయితే దైవప్రవక్త(స) నిద్రిస్తుండగా ఆయన్ని అబూబక్ర్(రజి) లేపేవారు కారు. మరి అంతలోనే హజ్రత్ ఉమర్(రజి) కూడా మేల్కొన్నారు. చివరకు అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) తలవైపు దగ్గరగా కూర్చుని, బిగ్గరగా 'అల్లాహు అక్బర్' అని పలికారు. ఆ శబ్దానికి దైవప్రవక్త(స)కు కూడా మెలకువ వచ్చేసింది. "తక్షణం ఇక్కడి నుండి అందరూ బయలుదేరండి" అని ఆయన(స) ఆజ్ఞాపించారు. (కొంతదూరం వెళ్ళాక) ఆయన వాహనం మీది నుండి దిగి, మా అందరికీ నమాజ్ చేయించారు. కాని ఒక వ్యక్తి మాత్రం మాకు కొంత దూరాన– ఒక మూలన– కూర్చుని ఉన్నాడు. అతను మాతో కలసి నమాజ్ చేయలేదు. నమాజ్‌ను ముగించిన మీదట, దైవప్రవక్త(స) ఆ వ్యక్తినుద్దేశించి, "ఓయీ ఫలానా వ్యక్తీ! మాతో కలసి నమాజ్ చేయకుండా నీకు కలిగిన ఆటంకం ఏది?" అని అడిగితే, 'నేను లైంగిక అశుద్ధతను దూరం చేయడానికి స్నానం చేయటం తప్పనిసరి అయింది' అని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. "పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసుకో" అని ఆయన(స) అతనికి ఆజ్ఞాపించారు. తరువాత ఆ వ్యక్తి (తయమ్ముమ్ చేసుకుని) నమాజ్ చేశాడు.

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) అంటున్నారు: తరువాత దైవప్రవక్త(స) నన్ను కొంతమంది వాహనదారులతోపాటు ముందుకు పంపారు (మంచినీటి అన్వేషణ కోసం). ఆ సమయంలో మాకు తీవ్రంగా దాహమవుతున్నది. ఆ స్థితిలోనే మేము నీటి అన్వేషణలో ఉండగా మాకు ఒక స్త్రీ కనిపించింది. రెండు మంచినీటి తిత్తులతోపాటు వాహనంపై తన రెండు కాళ్ళు వ్రేలాడదీసుకుని సాగిపోతోందామె. 'మంచినీరు ఎక్కడుందమ్మా?' అని మేము ఆమెను అడిగాము. 'ఇక్కడెక్కడా మంచి నీరు లేదు' అని ఆమె చెప్పింది. 'పోనీ, నీ నివాస గృహానికి నీరు ఎంత దూరంలో ఉంటుంది?' అని ఆమెను అడిగితే, 'ఒక పగలు, ఒక రాత్రి ప్రయాణ దూరానికి' అని ఆమె చెప్పింది. 'అలాగైతే నీవు దైవప్రవక్త(స) సమక్షంలో హాజరుకావలసి ఉంటుంది' అని మేమామెతో అన్నాము. 'దైవప్రవక్త(స) అంటే ఎవరు?' అని ఆమె అడిగింది. ఇమ్రాన్(రజి) ఇలా అంటున్నారు: మేము ఆ స్త్రీని దైవప్రవక్త(స) ఎదుట హాజరు పరచగలిగాము. ఆమె మాకు వేసిన ప్రశ్నలే దైవ ప్రవక్త(స)కూ వేసింది. కాకపోతే, తాను తండ్రిలేని బిడ్డల (అనాథల) తల్లిననీ, దయచూపదగిన స్త్రీనని చెప్పింది. దైవ ప్రవక్త(స) ఆజ్ఞానుసారం ఆమె రెండు నీళ్ళ తిత్తులు క్రిందికి దించబడ్డాయి. ఆయన(స) వాటి మూతులను తన చేతితో స్పృశించారు. మేము నలభై మందిమి ఆ నీళ్ళ తిత్తులనుండి కడుపు నిండా నీరు త్రాగి దాహం తీర్చుకున్నాము. మా బక్కెట్లలో, నీళ్ళ సంచులలో నీరు నింపుకున్నాము. ఒంటెలకు మాత్రమే నీరు త్రాపలేదు. అయినా ఆమె నీళ్ళ తిత్తుల్లోని నీరు ఏమాత్రం తరగలేదు సరికదా అది క్రిందికి వొలికేలా నిండిపోయి ఉంది. ఆ తరువాత ఆయన(స) మాతో, "మీ వద్ద తినడానికి ఉన్న ఆహార పదార్థాలను నా దగ్గరకు తీసుకురండి" అని ఆదేశించారు. వెంటనే ఆ స్త్రీ ముందు రొట్టె ముక్కలు, ఖర్జూరాలు ఉంచటం జరిగింది. తరువాత ఆ స్త్రీ తన తెగవారి వద్దకు వచ్చినప్పుడు, వారిని ఉద్దేశించి, 'ఈ రోజు నేను అతిపెద్ద మాంత్రికుణ్ణి చూసి వచ్చాన'ని చెప్పింది. లేదా ఆయన్ని నమ్మి నడుచుకునేవారు ఆయన్ని దైవ ప్రవక్త(నబీ) అంటున్నారని అంది. ఎట్టకేలకు ఆ స్త్రీ ద్వారా అల్లాహ్ ఆమె తెగవారికి సన్మార్గ భాగ్యం ప్రసాదించాడు. ఆమె స్వయంగానూ ఇస్లామ్ స్వీకరించింది. ఆమె తెగవారు కూడా ఇస్లామ్‌ను స్వీకరించారు.




**- మదీహా అర్జుమంద్**


**(సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవం సందర్భంగా..)**

**మానవ** జీవితం కష్ట సుఖాల సంగమం. ఇక్కడ కష్టాలూ.. కన్నీళ్ళూ.. శాంతీ.. సమాధానమూ.. అన్నీ ఉన్నాయి. సంతోషంలో పొంగిపోవడం, కష్టాల్లో కుంగి పోవడం సరికాదు. అన్ని స్థితులనూ సమానంగా ఆస్వాదించడమే జీవితం. నిత్యజీవితంలో ఎదురయ్యే కష్టాలకు కుంగిపోయి జీవితాన్ని చాలించాలని నిర్ణయించుకోవడం ఎంతమాత్రం సరికాదు. కష్టాలు మనుషులకే వస్తాయి. చెట్లకు, పుట్టలకు రావు. జీవితంలో ఎలాంటి కష్ట నష్టాలనైనా ఎదుర్కొనే గుండె దిటవు కావాలి. నిజానికి ఎవరి మనసు వారి మాట వింటుంది. కనుక ఎవరికి వారు ధైర్యం చెప్పుకొని మనసును గట్టి పర్చుకోవాలి. ధృడంగా ఆలోచించాలి. ఎవరూ అర్థాంతరంగా జీవితాన్ని చాలించడానికి ఈ భూమ్మీదకు రాలేదు. జీవితం ఎంతో విలువైనది. దానికంటూ ఒక లక్ష్యం ఉంది. దానిపై దృష్టి పెట్టాలి. మన చుట్టూ అల్లుకున్న భయాలు, బాధలు, మూఢ నమ్మకాలను తరిమి కొట్టాలి. జీవితాన్ని అందంగా, ఆనందంగా, అర్థవంతంగా, ఆరోగ్యవంతంగా గడపడమనేది మాటలు చెప్పినంత తేలిక కాదు. నీతి సూత్రాలు వల్లించినంత సులభం కాదు. ఆచరణలోనే అసలు విషయాలు అనుభవంలోకి వస్తాయి. ఎవరైనా సరే.. నీతిగా, నిజాయితీగా కష్టపడి సంపాదించి బతకాలనే అనుకుంటారు. కానీ చాలా సందర్భాల్లో అలా కుదరక పోవచ్చు. ఉన్నపళంగా ఏదో ఒక సమస్య వచ్చి పడుతుంది. చేస్తున్న ఉద్యోగం ఊడిపోవచ్చు. వ్యాపారంలో నష్టం రావచ్చు. నమ్మిన వారు మోసం చేయవచ్చు. ఆర్థిక సమస్యలు చుట్టు ముట్టి మనసుకు ఆందోళన కలిగించ వచ్చు. హఠాత్తుగా భవిష్యత్తు అంధకారంగా కనిపించవచ్చు. ఆదాయ మార్గాలు మూసుకుపోయి భవిష్యత్తు అగమ్య గోచరం కావచ్చు. అంతమాత్రాన కుంగిపోవడం, బెంబేలెత్తడం, జీవితాన్నే ముగించాలనుకోవడం పరిష్కారమార్గం కానేకాదు. ఒక్క నీటి బిందువు మీద పడితేనే చీమ లాంటి చిరుజీవి చివరి క్షణం వరకూ ప్రాణం కాపాడుకోవడానికి పోరాడుతుంది. చల్లని చిరుగాలి వీస్తే వణుకుతున్న పండుటాకుపై విన్యాసాలు చేస్తున్న చిరుప్రాణి బ్రతుకు కోసం రాజీలేని పోరాటం చేస్తుంది.. మరి అలాంటిది దైవ ప్రసాదితమైన నిండు ప్రాణాన్ని త్యాగం చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసం.. అసలు ఈ భూమ్మీద మనిషి తప్ప, మరో ప్రాణి ఏదైనా ఆత్మహత్యకు ప్రయత్నించడం మనం ఏనాడైనా చూశామా.. వివేక స్రష్ట, మేధా సంపన్నుడైన మానవుడే ఎందుకింత బేలగా, పిరికివాడుగా, ఏకంగా ప్రాణాలే తీసుకునేంత బలహీనుడుగా తయారయ్యాడు. మనం దాదాపు ప్రతిరోజూ పత్రికల్లో చూస్తూ ఉంటాం. 'నా చావుకు ఎవరూ కారణం కాదు. జీవితం మీద విరక్తి కలిగి నా అంతట నేనే ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా కోసం ఎవరూ బాధపడకండి. అమ్మా..నాన్నా నన్ను క్షమించండి.. తమ్ముణ్ణి, చెల్లిని జాగ్రత్తగా చూసుకోండి. బాగా చదివించండి. ఇక సెలవు'.. ఈవిధమైన ఉత్తరాలు.. ఆత్మహత్యకు ముందు తమ స్వహస్తాలతో రాసుకునే ఈ చివరి ఉత్తరం రాయడానికి కనీసం అయిదు నిమిషాలైనా పడుతుంది.. అందులో ఒక్క నిమిషం ఆలోచించినా, ఆత్మహత్యకు పురిగొలిపిన ఆ సమస్యలనుంచి బయటపడే మార్గం దొరికేది.

విజ్ఞత, వివేకాలను వినియోగించని కారణంగా అనేకమంది ఆత్మన్యూనతా భావానికి, తీవ్రమైన ఒత్తిడికి గురై ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి ఒక్కొక్కరిది ఒక్కో కారణం. మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, గృహహింస, చదువులో రాణించలేక పోవడం, ర్యాంకుల ఒత్తిడి, ప్రేమ విఫలం కావడం, ఆత్మీయుల్ని కోల్పోవడం, కుటుంబ కలహాలు, వరకట్న వేధింపులు, అవాంఛిత గర్భం, దీర్ఘకాలికమైన, నయంకాని జబ్బులు, తీర్చలేని అప్పుల భారం, ఆస్తి నష్టం, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, ఉన్నవారికి

లేనివారికి మధ్య పెరుగుతున్న అంతరాలు, ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అస్థిరత, మతపరమైన విద్వేషాలు, సైద్ధాంతిక కారణాలు, సినిమా పిచ్చి, హీరోలపై మితిమీరిన అభిమానం, ఉద్యోగాన్ని, గౌరవాన్ని, సామాజిక హెూదాను కోల్పోవడం, నిరుద్యోగం, తాగుడుకు బానిస కావడం, అనువంశికమైన, జన్యులోపాలు, కుటుంబంలో ఎవరి అండదండలు లేకపోవడం, ఎవరూ సరిగ్గా పట్టించుకోకపోవడం, మోసపోవడం, భార్య భర్తల మధ్య గొడవలు, ఒకరినొకరు అర్థం చేసుకోలేక పోవడం తదితర కారణాల వల్ల జీవితం పట్ల అవగాహన లోపించి, మానసికంగా కుంగిపోయి ఇక ఆత్మ హత్య తప్ప మరో మార్గం లేదనే నిర్ధారణ కొస్తున్నారు. ఎక్కువ మంది క్షణికావేశంలోనే ఆత్మహత్యలు చేసుకుంటారు. అంతేకాదు, నచ్చిన కూర వండలేదనో, పండుగకు పుట్టింటికి పంపలేదనో, సినిమాకు వద్దన్నారనో, చీరలు, నగలు, కొనిపెట్టలేదనో, పెళ్లి కావడం లేదనో, ఒంటరిగా బతకలేమనో, చివరికి సెల్ ఫోన్ కొనివ్వలేదనో.. ఈవిధమైన చిన్నచిన్న, అర్థం పర్థం లేని కారణాలతో కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఆసమయంలో వారిని గమనించి ఎవరైనా ఆపగలికితే గండం గడిచిపోతుంది. ఇలాంటి ఆలోచనలు కలిగిన వారు నలుగురికీ దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడతారు. తలుపులు వేసుకుని కూర్చోవడం, చావు గురించో, ఆత్మహత్య ప్రయత్నాల గురించో మాట్లాడడం చేస్తుటారు. విషాద గీతాలు, విషాద కవితలు హమ్ చేస్తుంటారు. చేస్తున్న వృత్తి, ఉద్యోగాల్లో ఆసక్తి తగ్గిపోతుంది. మత్తుపదార్థాలకు బానిసలవు తారు. నిరాశా వాదం ఆవహిస్తుంది.

ఇవన్నీ ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారి లక్షణాలు కాకపోయినా, వీటిలో కొన్నింటినైనా ప్రదర్శించడం అలాంటి వాళ్ల సహజ లక్షణమై ఉంటుంది.'నాకు బ్రతకాలని లేదు. చస్తే తప్ప నా సమస్యకు పరిష్కారం లేదు.' అనుకునే వాళ్లు ఏదో ఒక సందర్భంలో తమ మాటలు, చేతల ద్వారా సంకేతాలు వ్యక్తం చేస్తుంటారు. అలాంటప్పుడు ఆత్మీయులు పసిగట్టగలగాలి. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోగలగాలి. మేమున్నామన్న భరోసా ఇవ్వగలగాలి. ఆసమయంలో వాళ్ళు ఏమైనా చెప్పదలచుకుంటే ప్రశాంతంగా వినాలి. వాళ్లభావాలను మనసు విప్పి మీతో పంచు కొనే వాతావరణాన్ని కల్పించాలి. మనసులో ఉన్నదంతా కక్కనివ్వాలి. ఎంతసేపు ఏడుస్తారో ఏడ్వనివ్వాలి. ఎన్ని కన్నీళ్లు కారుస్తారో కార్చనివ్వాలి. అడ్డు చెప్పే ప్రయత్నం చేయకూడదు. ఎంత వరకు వాళ్ల భావోద్వేగాల్ని బయట పెట్టగలరో అంత వరకు ఓపిగ్గా ఎదురు చూడాలి. హృదయ భారం దిగే వరకు వేచి ఉండాలి. ఆవేశం, కోపం, పశ్చాత్తాపం, ఒక్కసారిగా కట్టలు తెగి ప్రవహించి, మనసు కాస్త కుదుట పడిన తరువాత, ప్రేమగా భుజం తట్టాలి. ఆప్యాయంగా గుండెలకు హత్తుకోవాలి. ధైర్యం చెప్పాలి. మేమున్నామన్న భరోసా కల్పించాలి. జీవితం మీద ఆశ కల్గించే మంచి స్ఫూర్తిదాయక మాటలు మాట్లాడాలి. ఎంతటి కష్టాలనైనా ఎదురీది నిలిచిన విజేతల గురించి వివరించాలి. సకారాత్మక (పాజిటివ్) దృక్పథాన్ని మనసు నిండా నింపాలి. ఈవిధంగా గనక చేయగలిగితే ఆత్మహత్యా ప్రయత్నం నుండి ఖచ్చితంగా నివారించే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఆలోచనలు వస్తున్న వారు, ఒంటరిగా కూర్చుని బాధల్లోంచి బయటకు రాలేకపోతున్నామనే భావనతో కుమిలిపోవడం మంచిది కాదు. సమస్యలు ఏవైనా సరే.. ఏ స్థాయిలో ఉన్నా సరే అయినవాళ్లతో కాసేపు పంచుకోవాలి. స్నేహితులతో షేర్ చేసుకోవాలి. పని ఒత్తిడి, పరిమితి లేని కోర్కెలు.. చిన్న విషయానికే ఆవేశం, మనస్థాపానికి గురికావడం, అసూయ లాంటి మానసిక రుగ్మతలు తగ్గించుకోవాలి. బిడ్డల భవిష్యత్తు, జీవితాంతం కష్టసుఖాల్లో కలకాలం కలిసి ఉంటామని భార్యతో చేసిన బాస గుర్తుకు తెచ్చుకోవాలి. సమస్యలుంటే తల్లిదండ్రులు, మిత్రులు, ఆత్మీయులతో పంచుకోవాలి. అన్ని మత ధర్మాలూ ఆత్మహత్యను పాపంగా పరిగణించాయి. కనుక మనకు జీవితాన్ని ప్రసాదించిన సృష్టికర్తను గురించి ఆలోచించాలి. ఆయన్ను స్మరించాలి. కష్టాల నుండి గట్టెక్కించమని వేడుకోవాలి. భక్తి భావనలు, ఆధ్యాత్మిక ఆలోచనలు ఉన్నవాళ్లకు సహజంగానే ఇలాంటి అపసవ్యమైన ఆలోచనలు రావడం చాలా తక్కువ. మనల్ని, మన ప్రపంచాన్ని ఏదో అద్భుత శక్తి నడిపిస్తోందన్న ఆశావాదం జీవితంపై ప్రేమను పెంచుతుంది. దైవం ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన బరువు బాధ్యతలు మోపడు. కనుక ఆ పరాత్పరుడు ప్రసాదించిన ప్రాణాన్ని తీసుకునే హక్కు మనకు లేదు. ఈ విషయాలపై అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారించడం కోసం 2003 నుండి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మానసిక వైద్యనిపుణులతో అవగాహనా సదస్సులు కూడా ఏర్పాటు చేస్తారు. పసుపు, నారింజ రంగు రిబ్బన్లు చేతులకు ధరించి, 'ఆత్మహత్యలు వద్దు- నిండైన జీవితం ముద్దు' అనే నినాదాలు చేస్తూ, అవగాహనా ప్రదర్శనలు నిర్వహిస్తారు ●




**దేశం**లో రాజకీయాలు ప్రజల్లో చిచ్చుపెట్టడమే ముఖ్యంగా నడుస్తున్నాయని, దీనివల్ల దేశంలో విద్వేషం అనేది నిత్యకృత్యమై పోయిందని గాంధీజీ మునిమనుమడు తుషార్ గాంధీ అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పదేళ్ళ పాలన తర్వాత తన తాతగారు గాంధీజీ వారసత్వంపై ఇప్పుడు బాహాటంగా దాడులు జరుగుతు న్నాయని అన్నారు. ఆయన్ను విలనుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. దేశవిభజన కాలంలో జరిగిన హింసాకాండకు గాంధీజీ కారకుడని ఆరోపించడం ఎక్కువైందని, ఆయన్ను ముస్లిముల పక్షపాతిగా చిత్రీకరిస్తున్నారని, హిందువుల వ్యతిరేకి అని ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. గాంధీ రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టరుగా పనిచేస్తున్న తుషార్ గాంధీ సిబిసి వార్తా సంస్థతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్తితులు చాలా నిరాశజనకంగా ఉన్నాయని చెప్పారు. గాంధీజీ తదితరులు కలలు గన్న బహుళత్వంతో కూడుకున్న ఇండియా ఇప్పుడు అసహనానికి మారుపేరుగా మారిందని చెప్పారు. క్విట్ ఇండియా దినోత్సవం ప్రతి సంవత్సరం మాదిరిగా ఈసారి జరక్కుండా తనను పోలీసులు అడ్డుకున్నారని ఆయన చెప్పారు. తాను క్విట్ ఇండియా దినోత్సవంలో పాల్గొనడానికి వెళ్ళినప్పుడు తనను నిర్బంధించి పోలీసు స్టేషనుకు తరలించారని చెప్పారు. తాము కేవలం ఒక 50 మంది మాత్రమే ఈ క్విట్ ఇండియా దినోత్సవంలో ఎప్పుడు పాల్గొంటు ఉంటామని, తమ నాయకుడు 99 సంవత్సరాల స్వతంత్ర సమరయోధుడు జి.జి.పారిక్ కూడా శాంతిభద్రతలకు ప్రమాదంగా ప్రభుత్వం భావించిందని అన్నారు. ఇదంతా ఆశ్చర్య కరంగా ఉన్నప్పటికీ స్వేచ్ఛలపై ఇలాంటి నిర్బంధాలు ఇక మామూలైపోతాయని చెప్పారు. దేశంలో విద్వేషం, హింసాకాండలు మామూలై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా దినోత్సవం ద్వారా ప్రేమ సామరస్యాల సందేశం ప్రచారం చేయాలనుకున్నామని కాని దానిపై కూడా ఆంక్షలు విధించారని అన్నారు. ఇప్పుడు తమ నినాదం విద్వేషమా ఇండియా వదలి పెట్టు అంటూ హేట్ క్విట్ ఇండియా నినాదమిచ్చారు. కాని ప్రభుత్వం ఈ నినాదం చాలా ప్రమాదకరంగా భావిస్తోందని అన్నారు. భారత సమాజంలో కులమత విభజనలు ఎప్పటి నుంచో ఉన్నాయని, ప్రాంతీయ భేదాలు, భాషాభేదాలున్నాయని, స్వతంత్రోద్యమ కాలంలో మతపరమైన విభేదాలు దేశవిభజనకు దారి తీశాయని, ఇప్పుడు కులాల విభజనలు ఎక్కువవుతున్నా యని, అలాగే స్త్రీ పురుష విభేదాలు కూడా పెరిగిపోయాయని చెప్పారు. విభేధాలు ఎన్ని ఉన్న, ఎన్ని తేడాలున్నా స్వతంత్రం తర్వాత 70 సంవత్సరాల కాలం చాలా వరకు ప్రశాంతంగా కలిసి మెలిసి బతికామని, కాని గత కొన్ని సంవత్సరాలుగా విద్వేషమే రాజకీయంగా మారిన తర్వాత పరిస్థితులు దిగజారా యని చెప్పారు. ప్రపంచంలో గాంధీజీని గొప్ప నాయకుడిగా చూస్తున్నప్పటికీ భారతదేశంలో విద్వేషం ప్రచారం చేస్తున్న నేతలు గాంధీజీని అవహేళన చేయడం, గాంధీజీపై దాడులు చేసి ఆయన ప్రతిష్ఠను మంటగలిపే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. గాంధీజ హత్యకు కారణమైన సిద్ధాంతం గాంధీ హత్య తర్వాత విద్వేష ప్రచారాన్ని చాపక్రింద నీరులా విస్తరించేలా చేసిందని, గాంధీవాదులు ఈ పరిణామాన్ని పట్టించుకోలేదని, అబద్ధాల ప్రచారాన్ని నమ్మేస్తూ రెండు మూడు తరాలు గడిచి పోయాయని, దేశ విభజనకు గాంధీ కారకుడనే అబద్ధాన్ని నమ్మించారని, గాంధీ ముస్లిం పక్షపాతి, హిందూద్వేషిగా నమ్మిస్తు న్నారని ప్రస్తుత పరిస్థితులు ఈ సుదీర్ఘ ప్రచారం ఫలితాలని అన్నారు. ఒక గాంధీవాదిగా తాను ఆశాజీవినని, తాను జీవించి ఉన్నంత కాలం శాంతిసందేశాన్ని ప్రచారం చేస్తూ ఉంటానని చెప్పారు. ❖


'చరితార్థులు'-2



# అమానత్ అలీ

## (-1857)

13






9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2** (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**స్వదేశీ పాలకుల పట్ల** గల అపార గౌరవాభిమానాలు, మాతృభూమి పట్ల మిక్కిలిగా గల ప్రేమాభిమానాల మూలంగా స్వదేశీ పాలకులు, స్వజనం మీద పెత్తనం చలాయిస్తున్న ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా స్వదేశీ పాలకులు, స్వదేశీ వీరులు మాత్రమే కాకుండా బ్రతుకుదెరువు కోసం బ్రిటిష్ భారత సైన్యంలో చేరిన భారతీయ సైనిక యోధులు, ప్రజలు కూడా 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. 1857 మే 10న మీరట్ నుండి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం ఆరంభం కాగానే బీహార్ రాష్ట్రంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తొలి సమర శంఖారావం పూరించిన యోధులలో అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్ అగ్రగణ్యులు. ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రంలో భాగంగా ఉన్న దేవ్‌ఘర్ జిల్లా రోహిని గ్రామంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరంలో జరిగిన తిరుగుబాటులో ఈ మువ్వురూ ప్రధానపాత్ర నిర్వహించారు. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్ భారత సైన్యంలో ఉద్యోగం చేస్తున్న వీరు 1857 జూన్ 12న తమ సహచరులలో స్వదేశాభిమానాన్ని, మాతృభూమి పట్ల దేశభక్తి భావనలను ప్రేరేపించి, కలసి వచ్చిన వారితో కంపెనీ అధికారుల ఆజ్ఞలను, ఆదేశాలను ధిక్కరిస్తూ తిరుగుబాటు పతాకాన్ని ఎగురవేశారు. అడ్డు వచ్చిన ఆంగ్లేయాధికారులను, ఆంగ్ల సైనికులను తుదముట్టించి సైనిక స్థావరంలో సంచలనం సృష్టించారు. ఈ విషయం తెలుసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ ఉన్నత సైనికాధికారులు భారీ బలగాలతో రోహిని చేరుకుని తిరుగుబాటు యోధులను చుట్టుముట్టారు. 'రోహిని తిరుగుబాటు'గా ఖ్యాతి గాంచిన ఈ తిరుగుబాటుకు కారకులైన అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్‌లను నిర్బంధించారు. ఈ రోహిని తిరుగుబాటు సమాచారం ఇతర ప్రాంతాలకు చేరేలోపుగా ఆఘమేఘాల మీద సైనిక విచారణ సాగింది. అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్‌లను విక్టోరియా రాణికి వ్యతిరేకంగా రాజద్రోహానికి పాల్పడ్డారని నిర్ధారిస్తూ ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికాధికారులు ఉరిశిక్షలను ప్రకటించారు. ఆ శిక్షల ప్రకారంగా 1857 జూన్ 16న రోహిని గ్రామంలోని ఒక మామిడి చెట్టుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉరి త్రాడులకు తిరుగుబాటు యోధులు అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్‌ల కంఠాలను బిగించి శిక్షలను బహిరంగంగా అమలుపర్చారు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా అప్పటి బీహార్ రాష్ట్రం ఇప్పటి జార్ఖండ్ రాష్ట్రంలో తొలి తిరుగుబాటుకు కారకులైన అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్‌లు అమరులయ్యారు. ఆ అమరవీరుల త్యాగనిరతిని స్మరణకు తెచ్చేలా వారి చిత్రాలతో జార్ఖండ్ రాష్ట్రం రోహిని వద్ద ఏర్పాటు చేసిన స్మారక స్థూపం అమానత్ అలీ, సలామత్ అలీ, షేక్ హరూన్‌ల ధైర్యసాహసాలను ఈనాటికి సందర్శకులకు గుర్తుకు తెస్తున్నది. ✤




# సఫర్ మాసం- అపశకున వాస్తవికత

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**దైవప్రవక్త** సల్లల్లాహు అలైహివ సల్లం రాకముందు, మానవాళి మేధోపరంగా, ఆచరణాత్మకంగా, నైతికంగా భయంకరమైన అంధకారంలో కొట్టుమిట్టాడుతూ ఉంది. జీవితంలోని ప్రతి మలుపులో చీకటి దట్టంగా పేరుకు పోయి ఉంది. దివ్యావిష్కృతి కాంతి లేని మూలంగా అవిశ్వాసం, అపనమ్మకాలు, ధర్మ విద్రోహ కర్మలు - మానవ మస్తిష్కంలో తిష్ట వేశాయి. స్వార్థం, సంకుచిత స్వభావం, దగా - మోసం, అబద్ధం- కపటత్వం, మానవ గౌరవాన్ని మంటగలుపుతున్నాయి. కామం, క్రోధం, మోహం, మదం, మత్సర్యం వాటి అవలక్షణాలతో అవనీతలమంతా అతలాకుతలమై ఉంది.

తాము అరబ్బులు అని పిలిచే బలమైన వ్యక్తులు దిష్టి నివారణకు, వ్యాధుల రక్షణకు వివిధ రకాల తాయెత్తులు - ఎముకలు, జంతువుల కాళ్లు, దంతాలు, మిరపకాయలు, నిమ్మకాయలు, బూడిది గుమ్మడి కాయలు, పసుపు నీళ్లు, వెంట్రుకల త్రాడు, దిష్టిబొమ్మలు, ఇతరత్రా వస్తువుల ద్వారా వాటిని నివారించే ప్రయత్నం చేసేవారు. వాటిని ఇంటి తలుపులు, గుమ్మం, గోడలు, శరీరంలోని వివిధ భాగాలకు, మెడలో వేలాడదీసి కట్టేవారు. అట్టి దుర్భర స్థితిలో మెరిసిందొక ఆశా దీపం- అదే మంచి, మానవత్వం మరచిన మానవాళికి శుభోదయం, నిజం మరచిన నరజాతికి నవోదయం. అదే అంతిమ దైవగ్రంథం ఖురాన్ అవతరణం, అదే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఆగమనం.

“అల్లాహ్ మాకు రాసి పెట్టినది తప్ప మరొకటి మాకు జరగదు. ఆయనే మా సంరక్షకుడు. విశ్వాసులయిన వారు అల్లాహ్‌నే నమ్ముకోవాలని (ఓ ప్రవక్తా! వారికి చెప్పు)”. (తౌబహ్: 51)

### ఖురాన్‌లో చేదు శకున ప్రస్తావన

“మేము మిమ్మల్ని మా పాలిట అపశకునంగా భావిస్తున్నాము. మీరు గనక (ఈ ప్రచారం) మానుకోకపోతే మేము మిమ్మల్ని రాళ్ళతో కొట్టి చంపేస్తాం. మా నుండి మీరు దుర్భర శిక్ష చవిచూడవలసి వస్తుంది” అన్నారు పట్టణవాసులు బెదిరిస్తూ. “మీ అపశకునం మిమ్మల్నే చుట్టుకొనిఉంది. మేము మీకు హితబోధ చేస్తున్నామనేనా మీరీ మాటలు అంటున్నది? మీరసలు హద్దుమీరిపోయారు” అన్నారు ప్రవక్తలు. (యాసీన్: 18,19)

బహుశా ఆ కాలంలో వర్షాభావ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు. దాని మూలం వారు, దైవప్రవక్తల రాకవల్లనే తమకు ఈ దరిద్రం చుట్టుకుందని (దైవం మన్నించుగాక!) చెప్పి ఉండవచ్చు. ధర్మపరాయణులను చూసి ఈనాడు కూడా కొంతమంది ఇలాంటి ‘అధిక ప్రసంగాలు’ చేసే వారున్నారు.

ఫిరౌనీయులలో (సత్యం పట్ల) స్పృహ రావడానికి మేము కొన్నేళ్ళపాటు వారిని దుర్భిక్షానికి, పంటల కొరతకు గురిచేశాం. (అయినా వారిలో మార్పు రాలేదు.) (ఆరాఫ్: 130)

అంటే అనావృష్టి ఏర్పడి వ్యవసాయం జరిగేది కాదు. వృక్షాలకు తెగులుపట్టి పండ్ల ఉత్పత్తి బాగా తెబ్బతినేది. ఫిరౌను జనుల్లోని పొగరును అణచి, వారిలో ఆధ్యాత్మిక చింతనను, దైవభీతిని సృజించే ఉద్దేశంతో దేవుడు వారిని ఈ విధంగా పరీక్షించాడు.

మంచి రోజులు వచ్చినప్పుడు తామందుకు అర్హులమని అంటారు. దుర్దినాలు దాపురించినప్పుడు మూసాని, అతని అనుచరుల్ని దుశ్శకునాలుగా పరిగణిస్తారు. (ఆరాఫ్: 131)

ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ఆ ఘనత తమదేనని గొప్పలు చెప్పుకునేవారు. గడ్డుకాలం వస్తేమటుకు మూసాను, ఆయన అనుయాయుల్ని దోషులుగా నిలబెట్టేవారు. మీ మూలంగానే మాకీ దరిద్రం పట్టుకుందని ఆడిపోసుకునేవారు. "హసనహ్" అంటే మంచిది, ధాన్యం, పండ్ల ఉత్పత్తుల్లో అధిక దిగుబడులు అని ఇక్కడ భావం. 'సయ్యిఅహ్' అంటే దానికి విరుద్ధమైనది, చెడ్డది అని భావం.

వారి దుశ్శకునం అల్లాహ్ చేతిలో ఉంది. కాని వారిలో చాలామంది ఆ సంగతి గ్రహించడం లేదు. (ఆరాఫ్: 131)

ఆయతులో 'తాయిరున్' అనే పదం ఉంది. 'తాయిరు' అంటే ఎగిరేదని అర్థం. అంటే పక్షి అన్నమాట! ఆనాడు పక్షులను ఎగురవేసి అవి కుడి దిశకు లేక ఎడమ దిశకు పోవటాన్నిబట్టి వారు 'శకునాలు' చూసేవారు. తాము అనుకున్న దిశలో గాకుండా పక్షులు మరొక వైపుకు ఎగిరిపోతే దాన్ని 'అపశకునం'గా భావించేవారు. అప్పట్నుంచి 'తాయిరున్' అనే పదానికి శకునం అన్న అర్థం స్థిర పడిపోయింది. ఇక్కడ ఇది ఈ అర్థంలోనే ఉపయోగించబడింది. శకునమైనా- అపశకునమైనా, సౌభాగ్య మైనా- దౌర్భాగ్యమైనా, కలిమి అయినా- లేమి అయినా అంతా అల్లాహ్ చేతుల్లోనే ఉన్నాయనీ, మూసానుగానీ, అతని అనుయాయులనుగానీ దోషులుగా నిలబెట్టడం అర్థం పర్థం లేని విషయమనీ అల్లాహ్ ఈ ఆయతులో చెప్పాడు. 'తాయిరుహుమ్ ఇందల్లాహి (వారి అపశకునం, దరిద్రం అల్లాహ్ వద్ద ఉంది) అంటే వారి దరిద్రానికి, అపశకునానికి కారణాలేమిటో అల్లాహు తెలుసు అని అర్థం. వారి దరిద్రానికి కారణం దైవతిరస్కారం, ధర్మం పట్ల వైముఖ్య ధోరణి తప్ప మరేదీ కాదు. వారు తిరస్కార వైఖరికి పాల్పడటంతో అల్లాహ్ తరపు నుంచి వారికి దరిద్రం చుట్టుకున్నదని కూడా భావం కావచ్చు.

వారు మూసాతో "నీవు మాపై మంత్రతంత్రాలు ప్రయోగిస్తూ మాముందు ఎన్ని చమత్కారాలు ప్రదర్శించినా మేము నిన్ను ఎన్నటికీ విశ్వసించం" అని తెగేసి చెప్పారు. (ఆరాఫ్: 132)

## హదీసులో చేదు శకున ప్రస్తావన

దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "వ్యాధి ఏది స్వతహాగా అంటువ్యాధి అయి ఉండదు. అపశకునం లేదు. ఏ పక్షిని చెడు శకునంగా భావించడం సరి కాదు. సఫర్ మాసాన్ని చెడుగా భావించడం తగదు". (ముస్లిం)

అన్ని రోజులూ మంచివే. అన్ని కాలాలూ మంచివే. మనం చేసే పనులు మంచివయితే ఫలితాలు మంచివి అవుతాయి. మన ఆలోచనలు సక్రమంగా ఉంటే మనం చేసే పనులూ సక్రమంగా ఉంటాయి. మన సామర్థ్యం, మన జ్ఞానం, మన అనుభవం, మన విశ్వాసం, మన ఆత్మ విశ్వాసం, కార్య ప్రణాళిక, క్రమశిక్షణ వీటిపైనే మన జయాపజయాలు, లాభనష్టాలు ఆధార పడి ఉంటాయి. అయితే కొందరు ఇవేమి పట్టనట్లు తమ నిర్వాకాలకు అన్యుల్ని, సూర్యచంద్రనక్షత్రాల్ని బాధ్యుల్ని చేస్తారు. 'మా వాడు మంచి నక్ష త్రంలో పుట్టాడు' అని ఒకడంటే, 'మీ హస్తవాసి మంచిది' అంటూనే హస్తాని కున్న వాచీ మీద కన్నేసేవాడు మరొకడు. 'అరచేతి గీత చూసి నీ రాత తెల్చేస్తాను' అంటాడు ఒకడు. 'నీ ఇంటి వాస్తు చూసి నీ కొంప కూల్చేస్తానంటాడు' మరొకడు. 'నీ బోణి మంచిది' అని ఒకడంటే, 'నువ్వు ఎదురొస్తే మంచిది' అంటాడు మరొకడు. ఒకడికి పిల్లి శకునం, ఒకడికి బల్లి శకునం, ఒకడికి తుమ్ము శకునం, ఒకడికి వితంతు చెల్లి శకునం, ఒకడికి విధవ తల్లి శకునం. ఒకడికి నక్క శకునం, ఒకటడికి కుక్క శకునం, ఒకడికి వితంతువు అక్క శకునం. ఒకడికి శుభ లగ్నం ఒకవేళ, మరొకడికి శుభ ముహూర్తం మరొకవేళ. కొందరికి కాకి శకునం, కొందరికి గుడ్ల గూబ శకునం, కొందరికి 10, 13 వంటి సంఖ్య శకునం, కొందరికి కొన్ని ఘడియలు శకునం కొందరికి కొన్ని రోజులు శకునం-ఒక్క మాటలో చెప్పాలంటే బాగా అందరిని ప్రభావితం చేసే ప్రమాదకర వైరస్ ఈ శకునం.

## తియరహ్, ఫాల్ మధ్య వ్యత్యాసం

అరబీలో తియరహ్ అంటే ఒక వ్యక్తి లేదా వస్తువు యెడల చెడు భావన, ఫాల్ అంటే ఒక వ్యక్తి లేదా వస్తువు యెడల మంచి భావన.

స్వతాహోగా అంటువ్యాధి లేదు. చెడు శకునం పూర్తి అవాస్తవ మైనది. నేను ఫాల్‌ను ఇష్టపడతాను. అంటే మంచి మాట అన్నారు ప్రవక్త (స). (సహీహ్ బుఖారీ)

## కాని కొందరు శకునాలు నమ్ముతారు

1) ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఖాళీ బకెట్‌ను చూసినట్లయితే అది చెడు శకునంగా భావిస్తారు.

2) అద్దం విరిగిన లేదా పగిలిన చాలా దుర్మార్గంగా పరిగణిస్తారు. ఉదయం సమయంలో అద్దం విరిగిపోతే అది చెడ్డదిగా భావిస్తారు. విరిగిన అద్దంలో ముఖాన్ని చూసుకోకూడదు. ఇదే సమయంలో చిన్న పిల్లలు అంటే ఓ ఏడాది కంటే తక్కువ వయస్సున్న పిల్లలను అద్దం చూడటానికి అనుమతించకూడదు అంటారు.

3) ఉదయం సమయంలో అత్యవసర పని మీద బయటకు వెళ్తుంటే పక్షుల వ్యర్థాలు తలపై పడితే అది శుభకరంగా భావిస్తారు. అలా కాకుండా గాయపడిన పక్షి మీ ప్రాంగణంలో పడితే అది చెడుగా పరిగణిస్తారు.

4) ఉదయం ఎక్కడికైనా వెళ్తుంటే మార్గం మధ్యలో జుట్టు కనిపించినట్లయితే అది పనికి అంతరాయంగా మారుతుందని అర్థం చేసుకోవాలి అంటారు.. అంతేకాకుండా వీలైనంత వరకు మార్గాన్ని మార్చుకోవాలి. లేదా పనిని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి అంటారు.

5) ఉదయం సమయంలో ఏదైనా కూరగాయలు లేదా పండ్లు కత్తితో కట్ చేసుకుంటుంటే అవి టేబుల్ నుంచి నేలపై పడితే అరిష్టంగా భావిస్తారు.

6) కుక్కలు, పిల్లులు ఏడుస్తున్న శబ్ధాలు వినడాన్ని చాలా చెడుకు సంకేతంగా పరిగణిస్తారు.

7) ఉప్పు చేతి నుంచి జారి పడిపోవడం చాలా అశుభంగా భావిస్తారు.

8) ఎవరైనా వ్యక్తి జంట పాములు కలిసి ఉండటం చూసినట్ల యితే అది అశుభంగా పరిగణిస్తారు.

9) రాబందు, కాకి లేదా పావురం తల మీద కూర్చున్నా లేదా రాబందులు, కాకులు ఎవరినైనా చుట్టుముడితే అలాంటి వ్యక్తులు ఓ నెలలోపే మరణించే అవకాశముంది అని నమ్ముతారు.

ఇలాంటి శకునాల్లో ఓ బుల్లి శకునం సఫర్ మాసపు శకునం. నమ్మకం అది ఏదయినా సరే, భౌతికంగా, మానసి కంగా మనల్ని బలహీన పరిస్తే దాన్ని విషంలా భావించి వదిలెయ్యాలి. అది ఎంతమాత్రం సత్యం కాదని తెలిసుకోవాలి. ఎందుకంటే సత్యం సదా మనిషిని బలపరుస్తుంది, దాన్ని నమ్మి నడుచుకునే వ్యక్తిలో నిత్య చైతన్యాన్ని నింపుతుంది.

## సఫర్ మాసం గురించి కొన్ని అపనమ్మకాలు

1) మొత్తం సంవత్సరంలో పది లక్షల ఎనభై వేల విపత్తులు ఆకాశం నుండి దిగి వస్తాయని భావిస్తారు. ఆ విపత్తలలో నుండి ఒక్క సఫర్ నెలలోనే తొమ్మిది లక్షల ఇరవై వేల విపత్తులకు గురికాబడతారని భావిస్తారు.

2) సఫర్ నెల రాగానే ప్రయాణాలను మానుకుంటారు, సంతోష కరమైన సంబరాలను జరుపుకోవడం అపశకునంగా భావిస్తారు.

3) ఈ నెల మొదటి పదమూడు రోజులను "తేర తేదీ" అని పేర్కొంటూ, తీవ్రమైన విపత్తులకు గురికాబడే రోజులుగా భావిస్తారు.

4) ఈ నెలలో వివాహాలు చేసుకోరు, పెళ్ళి చూపులకు సహితం దూరంగా ఉంటారు. ఒక వేళ క్రొత్తగా వివాహాలు జరిగి ఉన్నా ఆ జంటలను పదమూడు రోజుల వరకు విడదీసి, ఒకరి ముఖా లను మరొకరు చూడడం అపశకునంగా భావిస్తారు. అలా కాదని వారు గనుక కలుసుకుంటే, వారిద్దరిలో ఒకరు చనిపోతారు, లేక జీవితాంతం వారి మధ్య తగాదాలు ఏర్పడతాయని భావిస్తారు.

యదార్థం ఏమంటే? అలాంటి అపశకునాలకు ఇస్లాం ధర్మంలో ఎలాంటి వాస్తవికత లేదు. పైగా అలాంటి మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే? నెలలను లేక సమాయాలను అపశకునాలకు విపత్తులకు ప్రత్యేకిస్తే, అల్లాహ్ ను తప్పు పట్టినట్లుగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసారు. కనుక ఒక హదిసు ఖుద్సీలో ఇలా ఉంది:

"అల్లాహ్ ఇలా తెలియజేసాడు: "ఆదాము పుత్రుడు (మానవుడు) కాలాన్ని (రోజులను, నెలలను, యేడాదిని) తిట్టుతున్నాడు. మరియు నేనే కాలాన్ని. నా చేతిలోనే రాత్రింబవళ్ళ మార్పిడి ఉన్నది." (బుఖారి 4452, ముస్లిం:41 70)

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మరొక చోట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"మీరు కాలాన్ని తిట్టకండి. నిశ్చయంగా అల్లాహ్‌యే కాలము." (ముస్లిం:4165)

## ఆఖరి చహార్షుమ్బా

సఫర్ నెలకు చెందిన చివరి వారంలో ఉన్న బుధవారాన్ని ఊరుబయటకు వెళ్ళి పచ్చగడ్డిపై నడవటం పుణ్య ఆచారంగా భావిస్తారు. ఎందుకంటే? ఆ రోజే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి స్వస్థత లభించినది అని, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సరదాగా ఆ రోజు పచ్చగడ్డిపై నడిచారని అంటారు. దాని కారణంగా ప్రజలు భార్యపిల్లలతో కలిసి పార్కులలో, తోటలలో షికార్లు చేస్తారు. దానిని ప్రవక్త ఆచారం అని అంటారు.

దైవప్రవక్త(స) అన్నారు: "నిశ్చయంగా చెడు శకునం, తాయెత్తులు వేలాడదీసుకోవడం, మందు మాకు ద్వారా మనసును వస పరచుకోవచ్చు అన్న భావన షిర్క్ వంటిదే" (ముస్నద్ అహ్మద్)

"ఎవరయితే శుకున బారిన పడతారో వారి పరిస్థితి చాలా విచిత్రంగా ఉంటుంది. అతని మంచిని ఆశిస్తూ ఉంటాడు కానీ శకునం తాలూకు నిరాశే అతనిలో అధికంగా ఉంటుంది. అతను మంచి కోరికలు కలిగి ఉంటాడు కానీ, అతనిలో శకునం తాలూకు భయమే ఎక్కువ ఉంటుంది. విధి వక్రించినా, జరగాల్సిన మేలు జరక్కపోయినా ప్రతి దాన్ని అతను ఏదో ఒక వస్తువు శకునంగా భావించి, పరాజయ భారాన్నంతా ఆ వ్యక్తి లేదా వస్తువు మీద నెట్టేసి బాధ్యత నుండి పారి పోయేందుకు ప్రయత్నిస్తాడు. మనిషిలో తిష్ట వేసుకున్న శకున జాడ్యం అతన్ని ప్రగతి బాటన పయనించకుండా ఆపు తుంది. ఉన్నత స్థాయికి అతను చేరుకోకుండా నిరోదిస్తుంది. అలా అతని ప్రయత్నం వృథా అవుతుంది. అతని ఆశయం నీరుగారి పోతుంది" అన్నారు ఇమామ్ మావర్దీ (ర).

## శకునానికి విరుగుడు

'శకునం అనే భావన ఎలాంటిదంటే, దాన్ని ఆశ్రయించిన వ్యక్తిని భయం గుప్పెట్లోకి నెట్టుతుంది, అతన్ని తీవ్రంగా నష్ట పరుస్తుంది. దాన్ని పట్టించుకోని వ్యక్తి నుండి అది తోక ముడిచి పారి పోతుంది. అతనికి ఎలాంటి నష్టం వాటిల్లదు. ఎవరికయినా ఎప్పుడయినా ఇలాంటి ఆలోచన వచ్చినా, ఎవరి ద్వారా ఇలాంటి మాట విన్నా, ఇలాంటి దృశ్యాలను కన్నా అతను ప్రవక్త (స) వారు సూచించిన ఈ విరుగుడు ప్రార్థన చెయ్యాలి' అన్నారు ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (ర).

"అల్లాహుమ్మ లా ఖైర ఇల్లా ఖైరుక్. వ లా తైరా ఇల్లా తైరుక్. వ లా ఇలాహ గైరుక్". (అహ్మద్) - "ఓ అల్లాహ్! నీ వద్ద మేలయినదే అసలు మేలు, నీ వద్ద కీడయినదే అసలు కీడు. నువ్వు తప్ప వేరే ఆరాధ్యుడు లేడు". (ముస్నద్ అహ్మద్)

"అల్లాహుమ్మ లా యాతి బిల్ హసనాతి ఇలా అన్‌త. వ లా యద్‌హబు బిస్సయ్యిఆతి ఇల్లా అన్‌త. వ లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిక". (అబూ దావూద్) ఓ అల్లాహ్ నువ్వు తప్ప మేళ్ళను మాకు ప్రసాదించేవాడు ఎవ్వరూ లేరు. నువ్వు తప్ప మా నుండి చెడులను తొలగించే వాడు ఎవ్వడూ లేడు. నీ అనుగ్రం లేకుండా చెడు నుండి రకణ పొందే ధైర్యంగానీ, సత్కార్యం చేసే శక్తి గానీ మాలో లేదు". (అబూ దావూద్)

## శకునం నష్టాలు

శని, శకున, అరిష్ట భావాలు కలిగి ఉండటం వల్ల కలిగే నష్టాలను మనం పదిగా పేర్కొనవచ్చు.

1) శకునం విశ్వాసానికి విరుద్ధ పదం, నమ్మకానికి వ్యతిరేకం.

2) శకునం వల్ల కీడు సోకడంగానీ, మేలు కలగడం గానీ జరుగదు.

3) శకునం బుద్ధి మాంద్యానికి, వివేక శూన్యానికి నిదర్శనం.

4) శకునం ఆందోళనకు, చపల చిత్తానికి ఆనవాలు.

5) శకునం కార్య శూన్యతకు ప్రేరకం.

6) శకునం మంచి పనులు కూడా చేడకుండా అడ్డుకుంటుంది. మనిషి ప్రయత్నాన్ని మాన్పించి, పని దొంగగా మారుస్తుంది.

7) శకునం అజ్ఞాన కాలపు అవలక్షణం, మూర్ఖపు చేష్ట.

8) శకునాన్ని నమ్మడం అంటే విధి వ్రాతను తిరస్కరించడమే.

9) శకునం అవిశ్వాసుల గుణం.

10) అల్లాహ్ ఆదేశానికి, ప్రవక్త ముహమ్మద్ (స) వారి సున్నత్‌కు వ్యతిరేకం.




**మనిషి** మెదడు బాల్యదశలో అభివృద్ధి చెందుతూ ప్రౌఢ దశకు చేరుకున్న తర్వాత అంటే ఇరవై, పాతిక సంవత్సరాల తర్వాత అభివృద్ధి పూర్తిగా ఆగిపోతుందని మొన్నటివరకు నిపుణులు, శాస్త్రవేత్తలు నమ్మేవారు. కానీ మనిషి మెదడు ఏ వయసులోనైనా అభివృద్ధి చెందుతూ ఉండే కెపాసిటీని కలిగి ఉందని ఈ మధ్య కాలంలో గుర్తించారు. ఉదాహరణకు, కారు ప్రమాదం తర్వాత మెదడుకు గాయమై మాట్లాడే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తే, ఆ వ్యక్తులు మాట్లాడే సామర్థ్యాన్ని శాశ్వతంగా కోల్పోరు. చికిత్స, స్పీచ్ థెరపీ ద్వారా మెదడులోని పాత టిష్యూలను సరిచేయడం లేదా కొత్త మార్గాలను సృష్టించడం ద్వారా మెదడు మళ్ళీ మాట్లాడే సామర్థ్యాన్ని తిరిగి పొందుతుంది. ఈ విధానాన్ని 'న్యూరోప్లాస్టిసిటీ' అని పేర్కొంటున్నారు.

'న్యూరోప్లాస్టిసిటీ' అనేది మెదడు పునర్నిర్మాణ సామర్థ్యాన్ని సూచిస్తుంది. మెదడు ఈ విధానం ద్వారా రివైరింగ్ చేయబడు తుంది. ఇది కదలిక, సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తి సామర్థ్యాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. న్యూరోప్లాస్టిసిటీని కొన్ని అంశాలు ప్రోత్సహించడంలో సహాయ పడతాయి.

**వీడియో గేమ్స్** : కొన్ని రకాల వీడియో గేమ్స్ ఆడటం వల్ల మెదడు రివైరింగ్ అవుతుందని నిపుణులు గుర్తించారు. ఎందుకంటే వీడియోగేమ్స్ ఆడుతున్నప్పుడు మన మెదడు కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటుంది. అందువల్ల గేమ్ ప్లే చేస్తున్నప్పుడు ఆ గేమ్‌లో మనం చేస్తున్న తప్పులను గుర్తిస్తూ పదేపదే గేమ్ విజయవంతంగా ఆ లెవెల్‌ను పూర్తి చేసే ప్రయత్నం చేస్తుంటాము. ఈ ఎక్స్‌పీరియన్స్ మళ్ళీ గేమ్ ఆడేటప్పుడు మనకు పనికి వస్తుంది. గేమ్‌లో వైఫల్యం నుండి కోలుకోవడం నేర్చుకోవడం వల్ల ఎదురు దెబ్బల నుండి తిరిగి పుంజుకునే నైపుణ్యం మెరుగవుతుంది. గేమ్‌లోని టాస్క్‌కి విభిన్న పరిష్కారాలను అన్వేషించడం సృజనాత్మక ఆలోచనను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది.

వీడియో గేమింగ్ ద్వారా మోటార్ సమన్వయం, దృశ్య రూప గుర్తింపు, ప్రాదేశిక నావిగేషన్, జ్ఞాపకశక్తి, ప్రతిచర్య సమన్వయం, తార్కికత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సహకారం, జట్టు భాగస్వామ్యం వంటి నైపుణ్యాలు మెరుగుపడతాయి.

2019లో జరిగిన అధ్యయనం ప్రకారం 3డీ అడ్వెంచర్ గేమ్‌లు జ్ఞాపకశక్తి, సమస్య- పరిష్కారం, దృశ్య గుర్తింపులో మెరుగుదలకు దోహదపడతాయి. పజిల్ గేమ్‌లు సమస్య- పరిష్కార నైపుణ్యాలు, మెదడు కనెక్టివిటి, ప్రాదేశిక అంచనాలను పెంచడంలో సహాయ పడతాయి. వ్యాయామ గేమ్‌ల వంటి రిథం గేమింగ్ విజువస్పేషియల్ మెమరీ, శ్రద్ధను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది అనే విషయాలు వెల్లడయ్యాయి. ఈ ప్రభావాలు దాదాపు 16 గంటల గేమ్‌ప్లే తర్వాత ప్రారంభమవుతాయి.

వాస్తవానికి ఇది అంతగా సిఫార్సు చేయబడలేదు. కానీ విశ్రాంతి సమయంలో వారం వారీగా కొన్ని గంటల గేమ్‌ప్లేను జోడిస్తే న్యూరోప్లాస్టిసిటీని మెరుగుపరచడానికి గొప్ప మార్గంగా దోహద పడుతుంది.

**2) కొత్త భాష నేర్చుకోవటం :** కొత్త భాష నేర్చుకునే ప్రాసెస్‌లో మెదడు పని తీరు చురుగ్గా మెరుగుపడుతుంది. మన మెదడులో గ్రే మేటర్ సాంద్రత కూడా పెరుగుతుంది. గ్రే మేటర్ మెదడులోని అనేక ముఖ్యమైన ప్రాంతాలను కలిగి ఉంటుంది. భాష నైపుణ్యాలు, శ్రద్ధ, జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, మోటార్ నైపుణ్యాలను నిర్వహిస్తుంది. 2012లో జరిగిన అధ్యయనం ప్రకారం కొత్త భాషను ఎంచుకుని నేర్చుకోవటం వల్ల గ్రే పదార్థ సాంద్రత, న్యూరోప్లాస్టిసిటీని పెంచుతుందని నిరూపితం జరిగింది.

యుక్త వయసులో రెండవ భాషను నేర్చుకోవటం వల్ల తెల్ల పదార్థాన్ని కూడా బలోపేతం చేసుకోవచ్చు. ఇది మెదడులోని వివిధ ప్రాంతాల మధ్య మెదడు కనెక్టివిటీ, కమ్యూనికేషన్‌ను సులభతరం చేయడంలో సహాయపడుతుంది. ఏ వయసులోనైనా కొత్త భాషని అధ్యయనం చేయడం వలన బలమైన సమస్య-పరిష్కార, సృజనాత్మక ఆలోచనా నైపుణ్యాలు మెరుగుపడతాయి. మెరుగైన పదజాలం, ఎక్కువ పఠన గ్రహణశక్తి, మల్టిటాస్క్ సామర్థ్యం పెరుగుతుంది.

**3) సంగీతం :** సంగీతం కదలిక, సమన్వయ శక్తి, జ్ఞాపకశక్తి మెరుగు పరిచే సామర్థ్యాలను బలోపేతం చేయడంలో సహాయ పడుతుంది. సంగీత శిక్షణ కూడా న్యూరోప్లాస్టిసిటీ వ్యాయామంగా ఉపయోగపడుతుంది. ఇది మానసిక క్షోభ నుండి ఉపశమనాన్ని ఇస్తుంది. జీవన నాణ్యతను పెంచుతుంది.

మెరుగైన ఆడియో, దృశ్య గ్రహణశక్తి, దూరదృష్టి, శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, మెరుగైన మోటార్ సమన్వయం సంగీతం ద్వారా పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

**4) ప్రయాణాలు :** ప్రయాణాల్లో కొత్త దృశ్యాలు, పరిసరాలను చూడటం వలన, విభిన్న సంస్కృతులు గురించి తెలుసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. కొత్త ప్రదేశాలను సందర్శించడం వల్ల మీలోని దృష్టి కోణాన్ని విస్తృతం చేయడంలో సహాయపడుతుంది. స్నేహాలు, వ్యక్తిగత విలువలు, లక్ష్యాలు సాధించడానికి ఇది కొత్త దృక్పథాన్ని ఇస్తుంది.

**5) వ్యాయామం :** వ్యాయామం వల్ల శారీరక ప్రయోజనాలతోపాటు మెదడు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచుకోవచ్చు. ముఖ్యంగా ఏరోబిక్ వ్యాయామం వల్ల నేర్చుకోవడం, జ్ఞాపకశక్తి వంటి అభిజ్ఞ సామర్థ్యాలు మెరుగుదలకు దోహదపడుతుంది. న్యూరోప్లాస్టిసిటీ వ్యాయామం చేస్తున్నప్పుడు రక్త ప్రవాహం పెరిగి, మెదడులో కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల డిప్రెషన్ తగ్గుతుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**6) కళా నైపుణ్యాలు :** సృజనాత్మక కళా నైపుణ్యాలు ప్రపంచాన్ని కొత్త కోణంలో చూడటంలో సహాయపడతాయి. భావోద్వేగాలను క్రమబద్ధీకరించడానికి, సరిగ్గా వ్యక్తీకరించడానికి, వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడానికి, లేదా వ్యక్తిగత పోరాటాలపై లోతైన అంతర్‌దృష్టిని తెలియజేసేందుకు డ్రాయింగ్, పెయింటింగ్ వంటి కళా నైపుణ్యాలు సహాయపడతాయి. న్యూరోప్లాస్టిసిటీలో భాగంగా కళా నైపుణ్యాలను ఉపయోగించి మెదడు పనితీరును మెరుగుపరచుకోవచ్చు.

న్యూరోప్లాస్టిసిటీ అంటే మెదడు స్థిరంగా తనను తాను రివైరింగ్ చేసుకుని, దాని కనెక్షన్‌లను సవరించుకోవడం అని మనం తెలుసుకున్నాం. "ఈ వయసులో నేను ఏమీ చెయ్యలేను" అనే నిరాశను వీడి ఏ వయసులోనైనా, ఏ విషయాన్నైనా శ్రమ, సాధనతో తప్పక మనం సాధించవచ్చు, నేర్చుకోవచ్చు అనే విషయం న్యూరోప్లాస్టిసిటీ ద్వారా మనం తెలుసుకోగలిగాము. మన మెదడు ఎల్లప్పుడూ అభివృద్ధి చెందుతూనే ఉంటుంది అనే సత్యం మనం తెలుసుకుంటే మనం ఏ వయసులోనైనా, ఏదైనా సాధించగలం అనే ధైర్యం కొత్త కొత్త ఆశలను, ఆశయాలను చిగురింపజేస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.

## న్యూరోప్లాస్టిసిటీ కొరకు ఆహారం

మెదడు పునరుద్ధరింపబడటానికి ఒమెగా-3 ఫ్యాటీ ఆసిడ్స్ బాగా దోహదపడతాయి. అందుకొరకు ఫ్యాటీ ఫిష్, అవిశ గింజలు, అఖ్‌రోట్లు, అవకాడో, చియా సీడ్స్ వంటివి మంచి సపోర్ట్‌ను ఇస్తాయి.

మంచి పోషకాహారం, వ్యాయామం, కొత్త కొత్త నైపుణ్యాల సాధన, సృజనాత్మక కార్యక్రమాలు వంటివి మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. సృజనాత్మకత, చలనం లేకపోతే మెదడు మొద్దులాగా తయారవుతుంది. అందుకే ఎల్లప్పుడూ కొత్త విషయాలను నేర్చుకుంటూనే ఉండాలి. వచ్చిన, తెలిసిన విద్యలను సాధన చేస్తూనే ఉండాలి.

# అసూయ

- నసీరా బేగం

**అసూయ** అనేది మనిషిలో ఉండే బహు చెడ్డ దుర్గణం. ప్రతి కాలంలో ప్రతి చోట మనిషిని నాశనం చేసే ఈ దుర్గుణానికి గురైన ప్రజలు తారసపడుతూ ఉంటారు. అసూయ అంటే ఒక మనిషి స్త్రీ అయినా, పురుషుడైనా ఎదుటి వారిని మంచి పరిస్థితిలో, ధనవంతుని స్థితిలో, గౌరవప్రదమైన స్థితిలో, అధిక సంతానం ఉన్న స్థితిలో, అందంగా ఉన్న స్థితిలో, సంతోషకరమైన స్థితిలో ఉండగా చూసినట్లయితే ఓర్వలేకపోతాడు. అతని హృదయంలో మంటలు ఎగిసిపడతాయి. దానిద్వారా అతని పూర్తి దేహం కాలిపోతూ ఉంటుంది. అతని కళ్ళల్లోనుంచి నిప్పులు రాలుతూ ఉంటాయి. అతని నోటి ద్వారా అగ్ని మాటలు వెలు వడుతూ ఉంటాయి. ఈ విధంగా ఉంటుంది అసూయాపరుడైన వ్యక్తి పరిస్థితి. అతనూ సుఖంగా ఉండలేడు. ఎదుటివారిని సుఖంగా ఉండనివ్వడు. ఎదుటివారికి లభించిన అనుగ్రహాలన్నీ వారి నుంచి లాక్కోబడాలని, వారికి తీవ్రమైన నష్టం జరగాలని భావిస్తాడు. వారికి నష్టం జరిగినప్పుడు సంతోషపడతాడు. ఎవరిలోనైనా ఈ దుర్గుణం చోటు చేసుకున్నట్లయితే అతను ప్రమాదపు అంచులపై నుంచోని ఉన్నాడన్నమాట. అతని ఇహ పరలోకాలు రెండూ తీవ్ర నష్టానికి గురవ్వబోతున్నాయన్న మాట.

అసూయాపరుడు ఒక్క క్షణంపాటు కూడా అతను తృప్తిగా జీవించలేడు. ఎందుకంటే అతని మదిలో ఏదో ఒక విషయం గురించి ఎవరో ఒకరి గురించి అలజడి రేకెత్తుతూనే ఉంటుంది. ఎదుటివారికి లభించిన అనుగ్రహాలను ఎలా నష్టపరచాలి? అతని గౌరవ మర్యాదలను ఎలా మంటగలపాలి? సమాజంలో అతని పరువుని ఎలా తీయాలి? అనే దాని గురించి ఆలోచిస్తూ నీచమైన పనులకు ఒడిగడుతూ ఉంటాడు. ఎత్తుగడలు, పన్నాగాలు పన్నుతూ ఉంటాడు. అతని నీచమైన ఈ దుర్గుణం ద్వారా అతనికి అసూయకు గురైన వ్యక్తికి, ఇంకా సమాజానికి తీవ్రమైన నష్టం జరుగుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితికి గురైనప్పుడు ఆ అసూయాపరుడైన వ్యక్తి నుంచి రక్షణ పొందటానికి అల్లాహ్ ఈ దుఆను నేర్పాడు. 'వమిన్ షర్రిహాసిదిన్ ఇజాహసద్' నేను అల్లాహ్ శరణు కోరుతున్నాను. అసూయాపరుడు అసూయ పడేటప్పటి కీడు నుంచి. (113: 5)

ఈ వాక్యం ఎంతో వివేకంతో కూడుకుని ఉన్నది. అసూయాపరుడి కీడు నుండి శరణు కోరండి అని అనబడలేదు. అసూయాపరుడు అసూయపడేటప్పటి కీడునుండి అని చెప్పబడింది. ఎందుకంటే అసూయాపరుడి మనసులో భావాలు తలెత్తుతూ ఉంటే అది అంత ప్రమాదకరమైనవి కావు. కాని అతను ఆ అసూయలో రగిలిపోతూ ఎదుటివానికి నష్టానికి గురిచెయ్యటానికి కుట్రలు, ఎత్తుగడలు, పన్నాగాలు పన్నుతూ ఉన్నప్పుడు, నష్టానికి గురిచెయ్యాలనే ఉద్దేశ్యంతో అతను కార్యరంగంలో దిగినప్పుడు, దానికోసం అతను ఎంతకైనా తెగిపోయినప్పుడు అతని ఈ అసూయ నుంచి రక్షణ పొందటానికి అల్లాహ్‌ను వెంటనే శరణు కరుకోవాలి. అల్లాహ్ తనకు శరణు ఇచ్చినట్లయితే ఆ అసూయా పరుడి, అసూయ అతనికి రవ్వంత నష్టాన్ని చేకూర్చలేవు. పైగా ఆ అసూయాపరునికే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. అతను ఇతరుల పట్ల శత్రుత్వాన్ని పెంచుకున్నట్లు బహిరంగంగా కనిపించినా వాస్తవానికి అతను తనను తాను నష్టపరుచుకుంటు న్నాడు. తన పట్ల తాను శత్రువైపోతున్నాడన్నమాట. ఎందుకంటే ఒకవేళ అతను తనకి ఏవైతే లభించాయో వాటిపట్ల దృష్టి సారించి కృతజ్ఞతా భావాన్ని కలిగినట్లయితే అతని జీవితం సుఖంగా, సంతోషంగా సంతృప్తికరంగా ఉంటుంది. కాని దానికి వ్యతిరేకంగా అసూయ కారణంగా కష్టం, దుఃఖం, అసంతృప్తి, అభద్రతా భావం అనే వ్యాధులు అతన్ని చుట్టుముట్టి కంటిమీద కునుకు లేకుండా చేస్తాయి.

అసూయాపరుడుకు కలిగే నష్టాలలోని ఒక పెద్ద నష్టమేమిటంటే, అతను తన ప్రభువు పట్ల అనుమానానికి గురవుతాడు. ఎదుటి వ్యక్తి అనుగ్రహాలను చూసి అల్లాహ్ తన పట్ల అన్యాయం చేశాడని భావిస్తాడు. ఆ అనుగ్రహాలకు ఎదుటి వ్యక్తి అర్హుడు కాడని, తాను వాటికి అర్హుడని, కాని అల్లాహ్ తనకు ఇవ్వకుండా అతనికి ఇచ్చి తప్పు చేశాడని అంటాడు. అతని ఈ ఆలోచనా ధోరణి అత్యంత ప్రమాదకరమైనది. ఎవరికి ఏమి ఇవ్వాలో, ఎంత ఇవ్వాలో కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. వివేకవంతుడు, సర్వజ్ఞాని, న్యాయపరుడు అయిన అల్లాహ్ గురించి అతను ఈ విధంగా ఆలోచించటం బహు చెడ్డ విషయం. ఈ అసూయ కారణంగానే ఇబ్లీస్ దైవాజ్ఞను ధిక్కరించాడు. దాని కారణంగా అల్లాహ్ ఆగ్రహానికి, ధిక్కారానికి గురయ్యాడు. ఇహపరలోకాలను నష్టపరుచుకున్నాడు. మరి మనిషి కూడా అంతే.

మరొక నష్టమేమిటంటే, అసూయాపరుడైన వ్యక్తి వ్యక్తిత్వపు నిర్మాణపు కార్యాలు సమాజ సంస్కరణా కార్యాలు  లాంటి ఉన్నతమైన ఆశయాల గురించి ఎంత మాత్రం కృషి చెయ్యలేక పోతాడు. ఇంకా  తన జీవితాన్ని చక్కదిద్దుకునే బదులు, తన లక్ష్యసాధన కోసం కృషి చేసుకునే బదులు తన భవిష్యత్తు గురించి ఆలోచించే బదులు ఇతరులపై  దృష్టి పెట్టడంలోనే అసూయ చెందటంలోనే, ఆందోళన చెందటంలోనే నిమగ్నమై ఉంటాడు. దానికారణంగా అతను ఎలాంటి అభివృద్ధినీ పొందలేకపోతాడు. ఇంకా వారి ఇంటివారి కోసం కూడా ఒక మంచి వ్యక్తిగా రూపొంద లేకపోతాడు. తన బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వహించ లేకపోతాడు. దీనికారణంగా ఇంటివారి దృష్టిలో కూడా దిగజారి పోతాడు. సమాజంలోకూడా అతనికి ఎలాంటి విలువ ఉండదు. ఎందుకంటే అలాంటి వ్యక్తి ఎవరినీ ప్రేమించలేడు, గౌరవించ లేడు, ఎలాంటి త్యాగాన్ని చెయ్యలేడు, సహనమూ వహించలేడు.

అయితే ఇలాంటి దుర్గుణాలు కల మనిషి నుండి  దూరంగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటాడు. ఎందుకంటే వారు అతని ఈ  అసూయ తనకు ఘోర నష్టానికి గురిచేస్తుందనే ఆందోళనకు గురవుతారు. అతని నుంచి దూరంగా ఉండాలని భావిస్తారు. కాని అతని నుంచి దూరంగా ఉండటం ఒక్కొక్కసారి సాధ్యమయ్యే విషయం కాదు. కనుక భయాందోళనలకు గురికాకుండా వారి గురించి కొన్ని విషయాల జ్ఞానాన్ని తెలుసు కోవాలి.

1) ఎవరైతే అసూయాపరుడి అసూయ గురించి ఆందోళన చెందుతున్నాడో వారు వారు అల్లాహ్‌ను పూర్తిగా విశ్వసించాలి. తన ఆందోళనకు బహిర్గతం చెయ్యకూడదు. ఎవరు ఎన్ని పన్నాగాలు పన్నినా అల్లాహ్ కోరినట్లయితేనే ఆ పన్నాగం ద్వారా తనకు నష్టం జరుగుతుంది. అల్లాహ్ కోరకపోయినట్లయితే ఎవరు ఏమీ చేసుకున్నా ఎలాంటి నష్టం జరగదు. లాభనష్టాలన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే ఒక్క ఆకు కూడా భూమిపై రాలదు అనే విషయాన్ని నమ్మాలి.

2) అసూయాపరుడి అసూయకు గురైన వ్యక్తి అసూయాపరుడికి ఎలాంటి నష్టాన్ని తలపెట్టకూడదు. సాధ్యమైనంత వరకు మంచిగానే వ్యవహరించాలి. ప్రతీకారం తీసుకునే బాధ్యత అల్లాహ్‌ది. ఆయన దృష్టిలో రవ్వంత ఏ కార్యమూ గుప్తంగా ఉండదు. ఆయన సర్వాంతర్యామి, సర్వజ్ఞాని, ఆయన ప్రతీకారం చెయ్యదలిస్తే అతని పట్టు నుండి ఎవరూ విడిపించుకోలేరు అనేది వాస్తవ విషయం. దీన్ని గ్రహించాలి.

3) ఇంకా అసూయాపరుడి నీచమైన కార్యాలను, అశ్లీల సంభాషణలను విని కోపోద్రిక్తులు కాకూడదు. అతని పన్నాగాలకు బదులు తాము పన్నాగాలు చేసే అవసరం ఎంత మాత్రమూ లేదు. సహన స్థైర్యాలతో నిబ్బరంగా ఉండాలి. సహనాన్ని తన ఆయుధంగా మార్చుకోవాలి. సహనానికి అల్లాహ్ ఉత్తమమైన ప్రతిఫలాన్ని తప్పకుండా ప్రసాదిస్తాడనే నమ్మకాన్ని కలిగి ఉండాలి.

4) అసూయాపరుడైన వ్యక్తి కార్యాలకు ఎలాంటి విలువ ఇవ్వకూడదు. అతనికి సమాధానం పలకకూడదు. అతనిని చూసీ చూడనట్లుగా ఊరుకోవటమే అతనికి పెద్ద శిక్ష. కాని అతను హద్దులు మీరి ప్రవర్తిస్తూ ఉన్నట్లయితే అతన్ని హెచ్చరించాలి. ఇంకా ఇలా అనాలి. మేము దైవాజ్ఞల ప్రకారం, ఉత్తమ సుగుణాల కారణంగా నీకు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా ఉన్నాము. అంటే దాని అర్థం మేము మీకు భయపడి ఉన్నాము అని ఎంతమాత్రమూ నీవు భావించకు. హద్దులు మీరితే ప్రతీకారం తీసుకోవటానికి నడుం కట్టుకుని తప్పకుండా ఎదుర్కొంటాము అని. అతనికి మీరు చేసే ఈ హెచ్చరిక అతని గుండె వేగాన్ని పెంచుతుంది. ఇక మీ జోలికి రావటానికి అతను భయపడతాడు.

5) అసూయాపరుడైన వ్యక్తికి మీ సహాయం గనక అవసరమైతే తప్పకుండా సహాయం చెయ్యండి. ఈ సహాయం ద్వారా అతని గుండెలో రలుగుతున్న అగ్నిజ్వాలలు  చల్లబడతాయి. అతనికి భయపడకూడదు.  దానికోసం అల్లాహ్ ఏకత్వాన్ని పూర్తిగా విశ్వసించాలి. ఆయన గుణ విశేషాలను జ్ఞాపకం ఉంచుకోవాలి.

6) అతని అసూయ నుంచి రక్షణ పొందటానికి వాటికి సంబంధించిన దుఆలు చేసుకుంటూ ఉండాలి.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## ఫుట్ బాల్ దిగ్గజం ముహమ్మద్ హబీబ్ మృతి

భారతదేశానికి చెందిన ఫుట్ బాల్ దిగ్గజం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫుట్ బాల్ క్రీడాకారుడు పీలేను సయితం తన ఆటతో దిగ్భ్రాంతికి గురిచేసిన ముహమ్మద్ హబీబ్ తుదిశ్వాస విడిచారు. 1970లలో ముహమ్మద్ హబీబ్ పేరు భారత ఫుట్ బాల్ క్రీడకు మారుపేరుగా ఉండేది. 74 సంవత్సరాల ముహమ్మద్ హబీబ్ పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. తన స్వస్థలం హైదరాబాదులో ఆయన మరణించారు. ఆయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బ్యాంకాక్‌లో 1970లో జరిగిన ఆసియా క్రీడల్లో ఆయన కాంస్య పతకం సాధించారు. కోల్‌కతాకు చెందిన మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్, ముహమ్మదన్ స్పోర్టింగ్ టీములకు ఆడారు. భారతదేశంలో మొదటి ప్రొఫెషనల్ ఫుట్ బాలర్‌గా పేరు పొందారు. ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా ఆయనకు వచ్చిన అనేక ఉద్యోగావకాశాలు కూడా నిరాకరించారు. భారత దేశం తరఫున 35 అంతర్జాతీయ మ్యాచుల్లో ఆయన ఆడారు.

## తెలంగాణ ముస్లిములకు ఎవరేం చేశారు?

తెలంగాణ ముస్లిములకు కాంగ్రెస్ చేసిందేముందంటూ బీఆరెస్ ఎమ్మెల్సీ కే. కవిత కాంగ్రెస్‌పై దాడి చేశారు. బోధన్‌లో పాదయాత్ర తర్వాత ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పేదరికాన్ని పారదోలే బదులు పేదలను పారదోలే పని చేసిందన్నారు. హజార్ చూహే ఖాకే బిల్లీ హజ్ పే గయీ అనే సామెత చెబుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అలాగే ఉందన్నారు. కాంగ్రెసు నేత రాహుల్ గాంధీ చెబుతున్నవి బోగస్ మాటలని, కాంగ్రెసు రాష్ట్రాల్లో పెన్షన్లు ఇస్తున్నారా? మైనారిటీలు, గిరిజనుల కోసం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందో చెప్పగలరా? అని ప్రశ్నించారు. కవిత విమర్శలకు తెలంగాణ కాంగ్రెస్ అధినేత రేవంత్ రెడ్డి నుంచి జవాబు వచ్చింది. బీఆరెస్ ఇప్పుడు బీజేపీ బీ టీముగా మారిందని ఆయన విమర్శించారు. బీఆరెస్ అంటే బీజేపీ రిష్తేదార్ పార్టీ అన్నారు. అలాంటి పార్టీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలే చేస్తారని వ్యంగ్యంగా చెప్పారు.

## మతతత్వానికి పరాకాష్ఠ- టాప్ స్కోరు చేసిన బాలికకు గుజరాత్‌లో అన్యాయం

గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాలని లున్వా గ్రామంలో శ్రీ కే.టీ.పాటిల్ స్మృతి విద్యాలయ స్కూలు మత వివక్షకు పరాకాష్ఠ ఎలా ఉంటుందో చూపించింది. పదవ తరగతిలో 87 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచిన అర్నాజ్ బాను అనే ముస్లిం అమ్మాయి ఈ వివక్షను చూసి కన్నీళ్ళతో ఇంటికి మరలిపోయింది. ఈ స్కూలులో స్వతంత్ర దినోత్సవ వేడుకులలో పది, పన్నెండవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులిచ్చారు. కాని టాపర్‌గా నిలిచిన అర్నాజ్ బాను పేరు కూడా ఎవరు ఎత్తలేదు. తనకు అవార్డు వస్తుందని ఇంటి వద్ద గర్వంగా చెప్పి వెళ్ళిన అమ్మాయి కన్నీళ్ళతో తిరిగి రావడంతో తండ్రి సన్వర్ ఖాన్ స్కూలు వైఖరి పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. టాపర్‌గా నిలిచిన తనకు ఇవ్వవలసిన అవార్డును రెండవ స్థానంలో వచ్చిన మరో విద్యార్థికి స్కూలు ప్రదానం చేసిందట. ఈ విషయమై తండ్రి ప్రశ్నిస్తే స్కూలు అధికారులు జవాబేమీ ఇవ్వలేదట. జనవరి 26న ఇస్తామన్నారట. ఇప్పుడు ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నకు జవాబు లేదు. టాపర్‌గా నిలిచిన అమ్మాయికి జనవరి 26న అవార్డు తప్పక ఇస్తామంటున్నారు. అగష్టు 15న ఆమె స్కూలుకు రాలేదు కాబట్టి ఇవ్వలేదన్నారు. కాని అది అబద్ధం. అగష్టు 15 న ఆమె స్కూలుకు వెళ్ళింది. కావాలంటే సీసీ టీవీ ఫుటేజి చూసుకోండని తండ్రి సవాలు చేశాడు. ఇది మోడీఫైడ్ ఇండియా అని సలీల్ త్రిపాఠీ అనే సామాజిక కార్యకర్త ట్వీటు చేశారు. ప్రధాని మోడీ "సేవ్ డాటర్స్.. ఎడ్యుకేట్ డాటర్స్" నినాదాలు బలంగా వినిపిస్తున్నారు.

## ముస్లిం జాక్ 13 పాయింట్ల మానిఫెస్టో

తహ్రీక్ ముస్లిం షబ్బాన్, ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీల సంయుక్త సమావేశంలో తెలంగాణ ముస్లిముల సమస్యల గురించి మాట్లాడారు. 13 పాయింట్ల మానిఫెస్టోను విడుదల చేశారు. తహ్రీక్ ముస్లిం షబ్బాన్ అధ్యక్షుడు ముష్తాక్ మలిక్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, మతసంస్థలు, సామాజిక సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో హాజరయ్యారు. తెలంగాణాలో ముస్లిముల ప్రాతినిథ్యం తగ్గిపోతుందని, విద్య, న్యాయ, రెవిన్యూ విభాగాల్లో ముస్లింలు కనిపించడం లేదని వేలత్తి చూపించారు. ప్రాతినిథ్యం లేకపోవడం వల్ల తెలంగాణ ముస్లిములకు తగిన న్యాయం జరగడం లేదన్నారు. ముస్లిముల ప్రయోజనాలను ప్రస్తుత బిఆరెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ముస్లిములకు ఇచ్చిన చాలా హామీలను ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని చెప్పారు. ముస్లిములు మోసపోయామనుకుంటున్నారని చెప్పారు. కర్నాటకలో కాంగ్రెసు 15 మంది అభ్యర్థులను నిలబెట్టిందని, ఇందులో 9 మంది విజయం సాధించారని గుర్తు చేశారు. తెలంగాణలో ముస్లిం ప్రాతినిథ్యం విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ప్రొఫెసర్ ముహమ్మద్ అబ్దుల్ మజీద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




## టర్కీలో ఉర్దుగాన్ ప్రాభవం తగ్గుతుందా?

రజబ్ తయ్యిబ్ ఉర్దుగాన్ మూడవసారి టర్కీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. టర్కీ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. రేటింగ్స్ సంస్థ మూడీ టర్కీ క్రెడిట్ రేటింగ్ పెరిగే అవకాశం ఉందని తెలియజేసింది. మూడవసారి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత ఉర్దుగాన్ ఒక కొత్త ఆర్థిక కమిటినీ ఏర్పాటు చేశారు. సాంప్రదాయిక ఆర్థిక విధానాలను తిరిగి ప్రవేశపెట్టాలని చెప్పారు. జూన్ నాటికి కరంట్ ఎక్కౌంట్ మిగులు కనిపించింది. గత 18 నెలల్లో ఇదే మొదటిసారి. అంటే దేశం నుంచి బయటకు వెళ్ళిన డబ్బు కన్నా దేశంలోకి వచ్చిన డబ్బు ఎక్కువయ్యింది. టర్కీ స్టాక్ మార్కెటు ఇప్పుడు విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. ఉర్దుగాన్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశాలు లేవు. ఈ ఐదేళ్ళ పదవీ కాలమే చివరిది. ఆయన ఆరోగ్యం కూడా సహకరించడం లేదు. టర్కీ ఆర్థిక పతనానికి కూడా ఆయన విధానాలే కారణమని పలువురు విశ్లేషించారు. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటింది. టర్కీ కరెన్సీ విలువ ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ఫిబ్రవరిలో వచ్చిన భూకంపం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. ఉర్దుగాన్ తన విధానాలను పునస్సమీక్షించుకున్నట్లు కనిపిస్తోంది. ఆర్థిక మంత్రిగా మాజీ బ్యాంకర్ ముహమ్మద్ షంషెక్‌ను నియమించారు. ఆయన 2007 నుంచి 2018 మధ్య కాలంలో టర్కీ ఆర్థిక వ్యవస్థను గాటన పెట్టిన అనుభవజ్ఞుడు. స్థూల ఆర్థిక నిలకడకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన ప్రకటించాడు. టర్కీ సెంట్రల్ బ్యాంకుకు మొదటి మహిళా గవర్నరుగా హాఫిజా గాయె ఉర్కాన్‌ను నియమించడం కూడా ప్రముఖమైన నిర్ణయం. ఆమె రాగానే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే చర్యలు ప్రారంభిం చారు. ద్రవ్యోల్బణం పరిస్థితి చక్కబడకపోయినా, మారకద్రవ్యం నిధులు పెరిగాయి. ఉర్దుగాన్ ముందున్న సవాళ్ళు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, జీవన ప్రమాణాల సంక్షోభాన్ని నివారించడం. తన తర్వాత వచ్చే వారికి మెరుగైన ఆర్థికవ్యవస్థ అందించి తప్పుకోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాని ఇప్పటికే చాలా నష్టం జరిగింది. తలసరి ఆదాయం పతనమైంది. టర్కీ నుంచి చాలా మంది జీవనోపాధి కోసం దేశం వదలి వెళ్ళిపోతున్నారు. ఈ మేధో వలసలను ఆపడం కూడా ఆయన ప్రాధాన్యతల్లో ఒకటి. మేధోవలస ఆగకపోతే ఆర్థికంగా దేశం పుంజుకోవడం కష్టమవుతుంది. టర్కీని ఉర్దుగాన్ ఏ దిశకు తిప్పుతారో వేచి చూడాలి.


## ఆస్ట్రేలియాలో ఇస్లామిక్ బ్యాంకు

అనేక ముస్లిం మెజారిటీ దేశాల్లో ఇస్లామిక్ బ్యాంకులు సర్వ సాధారణం. ఇప్పుడు ముస్లిములు మైనారిటీలుగా ఉన్నప్పటికీ చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్న దేశాల్లో కూడా ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటవుతున్నాయి. బ్రిటన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో ఇస్లామిక్ బ్యాంకులు చురుకుగా పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఈ జాబితాలో ఆస్ట్రేలియా కూడా చేరింది. ఆస్ట్రేలియాలో 2024 నుంచి 8,13,000 మంది ముస్లిములు ఇస్లామిక్ బ్యాంకు ద్వారా సేవలు పొందుతారు. వడ్డీ ద్వారా లేదా మద్యం, జూదం వంటి సామాజికంగా నష్టదాయకమైన వ్యాపారాల ద్వారా లాభాలు పొందే ప్రసక్తి లేని ఇస్లామిక్ బ్యాంకు ఆస్ట్రేలియాలో పని ప్రారంభించబోతోంది. ఇస్లామిక్ బ్యాంకు ఖచ్చితంగా షరియా చట్టాలకు కట్టుబడి పనిచేస్తుంది. ఇస్లామిక్ బ్యాంకుల ప్రత్యేకత ఏమిటంటే ఈ బ్యాంకులు వడ్డీ ఇవ్వవు, వడ్డీ తీసుకోవు. ఆస్తుల క్రయవిక్రయాల్లో లాభాల అంచనాల ఆధారంగా లేదా డెరివేటివ్ ట్రేడింగ్ వంటివి ఉండవు. ఇస్లాం నిషేధించిన వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టడం జరగదు. ఈ నియమ నిబంధనలకు కట్టుబడి బ్యాంకు పనిచేస్తుందా లేదా అనే నిఘా నిరంతరం కొనసాగించే బోర్డు ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా బ్యాంకులు వడ్డీ ద్వారా లాభాలు ఆర్జిస్తాయి. ముస్లిములకు ధార్మికంగా వడ్డీ నిషిద్ధం కాబట్టి సాధారణ బ్యాంకుల్లో ముస్లిములకు ఈ ఇబ్బంది ఉంటుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని మూడవ అధ్యాయం సూరా ఆలి ఇమ్రాన్ 130వ వాక్యం ప్రకారం వడ్డీకి సంబంధించిన అన్ని లావాదేవీలు నిషిద్ధం. "విశ్వసించిన ప్రజలారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినటం మానండి. అల్లాహ్‌కు భయపడండి. మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది." అని దివ్యఖుర్‌ఆన్ పేర్కొంది. యూద, క్రయిస్తవ మతాల్లోను సాంప్రదాయికంగా వడ్డీపై నిషేధాలున్నాయి. అయితే వడ్డీ విషయంలో చాలా మినహాయింపులు ఇచ్చేశాయి. ఇస్లామిక్ బ్యాంకులు వడ్డీపై ఆధారపడవు. షరియా చట్టాల ప్రకారం లాభనష్టాల ఒప్పందాన్ని చేసుకుంటాయి. ఇందులో రుణగ్రహీతలు తమ లాభాల్లో కొంత శాతం బ్యాంకుకు చెల్లిస్తారు. బ్యాంకు డిపాజిటర్లు కూడా ఈ వ్యాపారాలపై వచ్చిన లాభనష్టాల్లో కొంత శాతం వాటా పొందుతారు. ఈ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసేవారి వ్యాపారాల్లో బ్యాంకులు కూడా భాగస్వాములుగా ఉంటాయి. ఆ విధంగా వ్యాపార లావాదేవీలను పర్యవేక్షిస్తూ ఉంటాయి. దివ్య ఖుర్‌ఆన్‌లోని సూరా బఖరాలోని 275వ వాక్యం ప్రకారం అల్లాహ్ వ్యాపారాన్ని అనుమతించాడు. వడ్డీని నిషేధించాడు.

# ఈ ఏడాది ఏమన్నా మారిందా?

**అగష్టు 15,** 2022న భారతదేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నేపథ్యంలో స్వతంత్ర వేడుకలు జరిగాయి. భారత ప్రధాని నారీశక్తి గురించి మాట్లాడారు. మహిళల గౌరవ మర్యాదలను కాపాడేలా అందరూ వ్యవహరించాలని చెప్పారు. అదే రోజున గుజరాత్‌లోని గోధ్రా జైలు నుంచి 11 మంది రేప్ నేరస్తులు విడుదల పొందారు. ప్రభుత్వ రెమిషన్ పాలసీ క్రింద వారిని విడుదల చేశారు. ఈ 11 మంది బిల్కిస్ బాను సామూహిక అత్యాచారం, ఆమె మూడేళ్ళ కుమార్తె హత్య కేసులో దోషులు. దేశంలో మొట్ట మొదటి ఆదివాసీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఢిల్లీలోని జగన్నాథ్ మందిరంలో ప్రవేశించకుండా అడ్డుకోవడం జరిగింది. ఆమె మందిరం బయటే తన పూజాదికాలు నిర్వహించవలసి వచ్చింది. కాని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ గారు మందిరంలోని విగ్రహా పాదాలకు నమస్కరించే అవకాశం దొరికింది. విద్వేష నేరాలు పెచ్చరిల్లిపోయాయి. రైల్వే కానిస్టేబుల్ పేర్లు అడిగి ముగ్గురు ముస్లిం ప్రయాణీకులను కాల్చి చంపాడు. ఉత్తరాఖండ్ దేవ్ భూమి అంటూ అక్కడి నుంచి ముస్లిములను పారదోలుతామని మతతత్వ శక్తులు పెట్రేగిపోయిన వార్తలు వచ్చాయి. హర్యానాలోని నూహ్ లో అల్లర్లు రెచ్చగొట్టింది భజరంగ్ దళ్ గోరక్ష యూనిట్ అధినేత మోను మానేసర్ అని స్పష్టమయ్యింది. గురుగ్రామ్‌లోని అనేక భవనాల నిర్మాణం వెనుక ఉన్నది బెంగాల్ నుంచి వచ్చిన వలస కార్మికులు. ముస్లిమ్ వలస కార్మికుల నివాస గృహాలపై దాడులు జరిగాయి. దహనాలు జరిగాయి. బంగ్లాదేశీలోని ముద్ర వేసి వారిపై హింసాకాండ కొనసాగింది. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలు చేసి ఊరేగిస్తూ అసభ్యంగా వారిని తాకుతున్న అమానుష దృశ్యాల వీడియో వచ్చింది. ఒలింపిక్స్ తదితర అంతర్జాతీయ వేదికలపై దేశానికి మెడళ్ళు సాధించిన మహిళా క్రీడాకారిణులు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధినేత బ్రజ్ భూషణ్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. మహిళా క్రీడాకారిణులను బలవంతంగా పోలీసులు ఈడ్చి పారేసిన వీడియోలు వచ్చాయి. దేశానికి మెడళ్ళు సంపాదించిన మహిళా క్రీడాకారిణులకే లైంగిక వేధింపులను తప్పించుకునే అవకాశాలు లేకపోతే సగటు మహిళ పని ప్రదేశంలో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కుంటుందో ఊహించవచ్చు. బిల్కిస్ బాను సామూహిక అత్యాచారం హత్య కేసుల్లో దోషులను విడుదల చేసిన తర్వాత బీజేపీ ఎమ్మెల్యే సి.కే.రౌల్జీ మాట్లాడుతూ వారంతా బ్రాహ్మణులు, బ్రాహ్మణులు ఉత్తమ సంస్కారవంతులుగా పేరుపడినవారు అన్నాడు. సామూహిక అత్యాచారం నిందితుల గురించి ఆయన చెప్పిన మాటలివి. ఈ రేప్ నేరస్తుల విడుదలను విశ్వహిందూ పరిషద్ పండుగ చేసుకుంది. పూలమాలలు వేసి స్వాగతం పలికింది. వారి కాళ్ళకు నమస్కారాలు చేస్తూ చాలా మంది సంబరాలు చేసుకున్నారు. ఫిబ్రవరి 4, 2022న కర్నాటక హైకోర్టు కర్నాటక ప్రభుత్వం విధించిన హిజాబ్ బ్యాన్‌ను సమర్థించింది. కర్నాటక విద్య సంస్థల్లో ముస్లిం బాలికలు హిజాబ్ ధరించే వీలు లేదన్నారు. ముస్లిం బాలికలు పరీక్షలు రాయకుండా అడ్డుకున్నారు. హిజాబ్ బ్యాన్ వల్ల వెయ్యిమందికి పైగా బాలికలు చదువు మధ్యలోనే మానేశారు. ముస్లిం సోదరీమణులకు స్వేచ్ఛ కల్పిస్తున్నామంటూ ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చిన పార్టీ చేసిన ఘనకార్యం ఇది.

**తుదిగీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**